ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 2 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 22.4



సాగర్ ప్రాజెక్టుకు.. కాల్షియం ముప్పు

- పూడిన పోరస్ హోల్స్
- కాల్షియాన్ని తొలగించకపోతే ప్రాజెక్టుకు పెనుప్రమాదం
- ఆందోళనలో అధికారులు, ఇంజనీర్లు

తెలుగు రాష్ట్రాల వరప్రదాయినిగా, 22 లక్షల ఎకరాలకు సాగు నీరు, 9 కోట్ల మందికి తాగునీటినీ అందిస్తున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కాల్షియం ముప్పు పొంచి ఉంది. కాల్షియంతో గ్యాలరీల్లో పోరస్ హోల్స్ మూసుకుపోవడంతో సీపేజ్ నీరు బయటకు రావడం లేదు. దీంతో ప్రాజెక్టు గోడలకు పగుళ్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు, ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్యాంకు ఏమైనా జరిగితే రెండు రాష్ట్రాల భవిష్యత్ ఆందోళనకరంగా మారుతుంది. డ్యాం నిర్వహణను చూసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని నిపుణులు, ఇంజనీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 220 అడుగులు, 350 అడుగులు, 420 అడుగుల ఎత్తులో మూడు గ్యాలరీలను క్రస్ట్‌గేట్ల లెవల్(546అడుగులు ఎత్తు) వరకు నిర్మించారు. ఈ మూడింటిలో పోరస్ రంధ్రాలతో(హోల్స్) పాటు డ్రైనేజీ హోల్స్ కూడా ఉంటాయి. మూడు గ్యాలరీల్లో 1,200 పోరస్ హోల్స్ ఉండగా 3 వేలకు పైగా డ్రైనేజీ హోల్స్ ఉంటాయి. పోరస్ హోల్స్ ద్వారా సీపేజ్ నీరు డ్రైనేజీ రంధ్రాల్లోకి వెళ్తుంది. అక్కడి నుంచి సీపేజ్ నీరు నదిలో కలుస్తుంది. ప్రస్తుతం మూడు గ్యాలరీల్లోని పోరస్ హోల్స్ అన్నీకాల్షియంతో నిండిపోయి సీపేజ్‌నీరు బయటకు వెళ్లడంలేదు. దీంతో డ్యాం గోడలకు పగుళ్లు వచ్చే అవకాశంఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 1,200పోరస్ హోల్స్‌లలో సుమారు350 పూర్తిగా మూసుకుపోయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పోరస్ హోల్స్ ఎందుకంటే

మానవ శరీరంలో మలినాలు బయటకుపోవడానికి స్వేదరంధ్రాలు ఉన్నట్లు ప్రాజెక్టులకు కాల్షియం నుంచి ముప్పు వాటిల్లకుండా నీటిలో పేరుకుపోయిన కాల్షియం బయటకు వెళ్లేందుకు పోరస్ హోల్స్‌ను ఏర్పాటుచేస్తారు. శరీరంలో మలినాలు చెమట రూపంలో బయటకు ఎలా వెళ్తాయో పోరస్ హోల్స్ ద్వారా ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన కాల్షియం అలాగే బయటకుపోతుంది. దీంతో ప్రాజెక్టు గోడలు పగుళ్లు ఏర్పడకుండా ఉండి ప్రాజెక్టుకు ప్రమాదం జరగకుండా ఉంటుంది.

గ్యాలరీల ద్వారా రోజుకు మూడు జీపీఎం నీరు వెళ్లాలి

గ్యాలరీల్లోని పోరస్ హోల్స్ ద్వారా రోజుకు మూడు జీపీఎం(గ్యాలన్స్ పర్ మీటర్)ల నీరు బయటకువెళ్లాలి. ప్రతి రోజూ ఎంత నీరు బయటకు వెళ్తుందో సంబంధిత ఇంజనీర్లు తమ సిబ్బందితో కొలతలు వేయిస్తారు. ప్రస్తుతం పోరస్ హోల్స్ మూసుకుపోవడంతో రోజుకు ఒక జీపీఎం నీరు మాత్రమే బయటకు వెళ్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఇలాగే కొనసాగితే డ్యాం గోడలకు పగుళ్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

లోపలివైపు శుభ్రపరిస్తేనే మేలు

పోరస్‌హోల్స్ 220, 350, 420 గ్యాలరీల నుంచి క్రస్ట్‌గేట్ల లెవల్ 546 అడుగుల వరకు ఉంటాయి మొదటి ఐదు మీటర్లు నిలువుగా ఆ తర్వాత అడ్డంగా డ్యాం గోడలకు రిజర్వాయర్ లోపలి వైపు వరకు ఉంటాయి. లోపల పేరుకుపోయిన కాల్షియంను తొలగిస్తేనే ప్రాజెక్టుకు ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. పోరస్ హోల్స్‌లో పేరుకుపోయిన కాల్షియాన్ని అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి తొలగించాలని నిపుణులు, ఇంజనీర్లు చెబుతున్నారు.



కాల్షియం తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం



గ్యాలరీల్లోని పోరస్ హోల్స్‌లలో పేరుకుపోయిన కాల్షియాన్ని లోపలి వైపు నుంచి తొలగించేందుకు ప్రతి దాది 400 రంధ్రాల చొప్పున (గ్యాలరీల్లో 1,200 పోరస్ హోల్స్ ఉన్నాయి) మూడేళ్లు పడుతుంది. దీనికిగానూ ప్రతి ఏడాది రూ.కోటి ఖర్చవుతుండటంతో రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ ఏడాది ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పనులు మొదలుపెడతాం.

- మల్లిఖార్జున్‌రావు, ప్రాజెక్టు ఈఈ

డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి : ఎస్పీ



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సేవ కార్యక్రమాల్లో భాగంగా డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలకు సోల్జర్‌లుగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. ఇంపాక్ట్ యాంటీ నార్కోటిక్స్ (డగ్స్) బృందం మంగళవారం ఎస్పీని కలిసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ద్వారా పోలీస్ కమాండ్ సెంటర్‌లో శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. ఇప్పటికే తాము ప్రభుత్వ అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పించామని తెలిపారు. డ్రగ్స్ నిరోధానికి తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ యాంటీ నార్కోటిక్ బృందం భాగస్వాములు కావడంతో మరింత అవగాహన పెంపొందించవచ్చన్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నూనె సుదర్శన్ మాట్లాడుతూ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని సమాజ సేవలో ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నూనె సుదర్శన్, లోడంగి గోవర్ధన్, గూడూరి అంజిరెడ్డి, కోట్ల సాయికిరణ్, నారాయణ, కవిత, కోట సరిత ఉన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

- వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల బిల్లులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్య.కా.స.) రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిందని, నెల అంతా సరిపోవని వ్యక్తికి 25కిలోలు చొప్పున పంపిణీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించడంతో చేసిన పనులకు కూలీలకు డబ్బులు ఇవ్వలేని స్థితి ఏర్పడిందన్నారు. పెద్ద ఎత్తున పెండింగ్ బిల్లులు ఉండడంతో వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, ఉడుగుండ్ల రాములు, ర నాయక్ పాల్గొన్నారు.

డిగ్రీ ప్రాక్టికల్స్ పరీక్షలు బహిష్కరిస్తాం

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎంజీయూ పరిధిలో డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరిస్తున్నామని తెలంగాణ లెక్చరర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సైదులు తెలిపారు. మంగళవారం ఫోరం తరఫున ఎంజీయూలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లుగా స్కాలర్‌షిప్‌లు రాకపోయినా, అప్పులుచేసి కళాశాల యజమాన్యాలు అధ్యాపకుల జీతాలు చెల్లిస్తూ వచ్చాయన్నారు. ఐదారు నెలలుగా నిర్వహణ చార్జీల వడ్డీలు పెరిగి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో ప్రయోగ పరీక్షలు బహిష్కరిస్తామని తెలిపారు.

సన్నబియ్యం పథకం పేదలకు వరం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జీ.ఎడవల్లిలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన మంత్రి
- రూ.4.67కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఐకేపీ కేంద్రం ప్రారంభం



జీ.ఎడవల్లిలో సన్నబియ్యం బ్యాగులను పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, కనగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సన్నబియ్యం పథకం పేదలకు వరమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జీ.ఎడవల్లి గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్నబియ్యం పథకం ప్రారంభంలో భాగంగా లబ్ధిదారులకు బియ్యం సంచులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలం లో పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ వినియోగదారులకు 200యూనిట్ల ఉచిత కరెంటు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలకు కొత్త రేషన్‌కార్డులను అందజేయలేదన్నారు. కమీషన్లు దండుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు జేసారని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీలో ఇటీవల జరిగిన ప్రమా దం దురదృష్టకరమన్నారు. ప్రమాదం కారణం గా సొరంగం పనులు నిలిచాయని, మరో ఏడా ది ఆలస్యమైనీ ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయిస్తానన్నారు. జీ.ఎడవల్లిలో రూ.4.67కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయటం ఆనందంగా ఉందన్నారు. జీ.ఎడవల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. జీ.ఎడవల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠిని కోరారు. రాజీవ్ వికాసం పథకం దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించిందని, నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవంలో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సన్నబియ్యం రైస్‌లో ఎన్నో రకాల పోషక విలువలు ఉన్నాయన్నారు. షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచటంలో విటమిన్లు సహకరిస్తాయన్నారు. సన్నబియ్యం పథకం నిర్విఘ్నంగా సాగాలంటే రైతులు ఇకనుంచి సన్నరకం వరి సాగును పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మంత్రికి మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి సభా స్థలం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్ రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ చాయదేవి, డీసీవో పత్యానాయక్, పీఆర్ ఈఈ గిరిధర్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎల్లమ్మ ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అనూప్ ఎరెడ్డి, మందడి రాంచంద్రారెడ్డి, జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, కృష్ణయ్యగౌడ్, మురళీ, వెంకటేశంగౌడ్, రాజారెడ్డి, వెంకటేశం, జియావుద్దీన్, హఫీజొద్దిన్, ఆర్‌ఐలు సునీత, యాదగిరి ఏపీఎం హరి, సీసీలు పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీస్ జాగిలం(బన్నీ) మంగళవారం నల్లగొండ నుంచి జీ.ఎడవల్లికి వచ్చింది. సభా ప్రాంగణంలో అనుమానిత వస్తువుల జాడకోసం హ్యాండ్లర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీ చేసింది. కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి గ్రామంలో మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప ర్యటన పురస్కరించుకుని కాంగ్రెస్‌నేతలు గ్రామంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

పోలీస్ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

కనగల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పీసీ నిమ్మ బేబీ షాలినీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠి ప్రశంసించారు. ఇటీవల జాతీయ పోలీస్ క్రీడలకు తెలంగాణ తరఫున బేబీషాలినీ వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారు. పలు మ్యాచ్‌లలో ఆమె అత్యుత్తమ ఆటతీరును కనబర్చింది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు.

పండుగ వాతావరణంలో..

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించే కార్యక్రమం జిల్లాలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. కనగల్ మండలం జీ.యడవల్లి గ్రామంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఏప్రిల్ నుంచి లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 997 రేషన్ దుకాణాలను ఇందుకు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 4,66,522 రేషన్ కార్డులకు 13,85,506 మంది లబ్ధిదారులున్నారు. ఒక్కొక్క లబ్ధిదారునికీ ప్రతి నెలా ఆరు కిలోల సన్నబియ్యం అందజేస్తారు. జిల్లాకు ఏప్రిల్ నెలలో 89,708 క్వింటాళ్ల సన్న బియ్యం కేటాయించారు. జీ.యడవల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని అనుముల, నారమ్మగూడెంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, శాలిగౌరరం మండలంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో అన్ని రేషన్ దుకాణాల్లోనూ పండగ వాతావరణంలో సన్న బియ్యం రేషన్ పంపిణీ చేయాలని నిర్ణయించారు. రేషన్ దుకాణాలకు రంగులు వేయడం, మామిడి తోరణాలు కట్టి, పూజలు చేసి లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి దుకాణంలో ప్రజాప్రతినిధులు వారికి వీలుకానిచోట అధికారులు అందించాలని నిర్ణయించారు.

నల్లగొండలో భూప్రకంపనలు ?

- వాట్సాప్‌లో పుకార్లు షికార్లు

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం నల్లగొండలో మంగళవారం పలుమార్లు భూకంపం వచ్చినట్లు పుకారులు షికార్లుచేశాయి. పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డు, మీర్‌బాగ్ కాలనీతోపాటు వివిధ ప్రాంతాల్లో భూమి కంపించిదంటూ వాట్సప్‌లలో చక్కర్లు కొట్టడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొన్ని సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించినట్లు సోషల్ మీడియాలో సైతం వైరల్ అయింది. మీర్‌బాగ్ కాలనీవాసులు మాత్రం అసలు అలాంటిది ఏమి లేదని, భూమి కంపించినట్లు కూడా తెలియలేదని తెలిపారు. మయన్మార్, థాయిలాండ్‌లలో ఇటీవల భారీ భూకంపం వచ్చిన అనంతరం నల్లగొండలో భూకంపమంటూ ఆనోటా, ఈనోటా చెప్పుకోవడంతో ప్రజలు భయపడ్డారు. అయితే ఈదంతా పుకారేనని తెలియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

5న మెగా జాబ్‌మేళా

డిండి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ఈ నెల 5న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డిండి ఎస్ఐ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలను డిండి పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న వ్యక్తులు 5వ తేదీన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్దకు ఉదయం రావాల్సి ఉంటుందన్నారు. అక్కడినుంచి నల్లగొండకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సెల్:8712675544ను సంప్రదించాలన్నారు.

'మత్తడి'కి మరమ్మతులు చేస్తే..

- 200 ఎకరాలకు సాగునీరు
- నిరాదరణతో కోల్పోయిన ఆనవాళ్లు
- ధ్వంసమైన మత్తడి అలుగుకట్ట



ఒకప్పుడు ఆ మత్తడి నీటితో నిండుగా ఉండేది. పిల్లలు వేసవిలో ఈత కొట్టేది. గ్రామస్థులు గాలాలు వేసి చేపలు పట్టేవారు. చుట్టుపక్కల రైతులకు సాగునీటి కొరత తీరేది. కానీ దశాబ్దాలు గడిచాయి. నిరాదరణకు గురైన మత్తడి ఎండిపోయింది. మత్తడి వద్ద కట్టిన అలుగు ఏన ధ్వంసమైంది.అప్పట్లో నీటితో కళకళలాడిన మత్తడిని స్వయంగా చూసిన రైతులు ఇప్పుడు ఆ మత్తడిని మళ్లీ అలా చూడాలనుకుంటున్నారు. రాబోయే కొన్ని నెలల్లో బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు నీరు కాల్వ ద్వారా వచ్చేలోపే మత్తడికి మరమ్మతులు చేయాలని నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం గ్రామరైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)

ఏపీలింగోటం శివారులో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మత్తడిని 1982లో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్మించినట్లు రైతులు చెబుతున్నారు. గ్రామానికి పడమర దిక్కున ఉన్న చెర్వు నీటిని వరదకాల్వ ద్వారా తరలించి తూర్పు దిక్కున ఉన్న ఈ మత్తడిలో నిల్వ చేసే వారు. ఫలితంగా చుట్టుపక్కల ఉన్న రైతుల బావుల్లో, బోరు బావుల్లో సమృద్ధిగా నీరు లభించేది. ఒకవేళ వరదనీటి ఉధృతి పెరిగితే అలుగు ద్వారా, మత్తడికున్న కట్ట తూము ద్వారా నీటిని వదిలితే కట్టంగూరు మండలం పామనుగుండ్ల చెరువుకు చేరేవి.కానీ ఏపీలింగోటం చెర్వులో కొన్ని దశాబ్దాలుగా ఒండ్రుమట్టి పేరుకుపోవడంతో చెరువులో నీరు ఇంకటం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో జాలు కాల్వ ద్వారా మత్తడికి చేరే నీరు ఆగిపోయిన కారణంగా నిరాదరణకు లోనైన మత్తడి ఆనవాళ్లు కోల్పోయింది.

మత్తడికి మరమ్మతులు చేస్తే

బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు ద్వారా ఇటీవల మండలంలోని పలు గ్రామాల రైతులు చెరువులను సొంత ఖర్చుతో శ్రమదానంతో నింపారు. రానున్న రోజుల్లో ప్రాజెక్టు కాల్వ ద్వారా ఏపీలింగోటం చెరువు నింపే అధికారిక ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే అప్పట్లో నాణ్యతాలోపంతో నిర్మించిన మత్తడి శిథిలమైంది. దీంతో వర్షం నీరు కూడా నిలవడంలేదు. బీ.వెల్లెంల ప్రాజెక్టు నీళ్లు వచ్చే అప్పటిలోగా మత్తడికి మరమ్మతులు చేస్తే కృష్ణాజలాలను మత్తడిలో నిల్వ చేసుకోవచ్చని, ఇదే జరిగితే తమకు శాశ్వతంగా సాగునీటి సమస్య తీరుతుందనేది రైతుల ఆలోచన.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



ఏపీలింగోటం శివారులో నిరాదరణకు గురైన పూర్వకాలపు మత్తడి దుస్థితిని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశందృష్టికి తీసుకెళ్లాం. మత్తడికి మరమ్మతులు చేస్తే సుమారు 200ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఉపాధి హామీ పథకం ఏపీవో వచ్చి మత్తడిని క్షేత్రపరిశీలన చేశారు. మత్తడిలో ఆనవాళ్లు లేకుండా ఏపుగా పెరిగిన చెట్లను తొలుత ఉపాధి పనిలో భాగంగా తొలగిస్తామని చెప్పారు.

- పశుపతి, చెర్వుగట్టు దేవస్థానం మాజీ ధర్మకర్త



నాగార్జునసాగర్‌లో దాసి సుదర్శన్ చిత్ర కళా నిలయం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసేన్ బెల్లంకొండ

7

సుదర్శన్‌తోనే 'దాసి' హిట్ అయ్యింది

- ప్రముఖ సినీ విమర్శకుడు ప్రసేన్ బెల్లంకొండ
- సాగర్‌లో 'దాసి' సుదర్శన్ చిత్రకళా నిలయం ప్రారంభం

'దాసి' చిత్రం పెద్ద హిట్ కావడానికి ప్రధాన కారకుడు సుదర్శన్ అని ప్రముఖ సినీ విమర్శకుడు ప్రసేన్ బెల్లంకొండ అన్నారు. దాసి సుదర్శన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సుదర్శన్ నివాసాన్ని ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, కవులు, కళాకారులు చిత్రకళా నిలయంగా మార్చారు. హైదరాబాద్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి ప్రారంభించారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

'తొలిసారి మిమ్మల్ని చూసిందీ మొదలు' అంటూ సాగే పాటను 1990 దశకంలోని ఎవరైనా ఇట్టే గుర్తు పట్టేస్తారు. 'శ్రీవారికి ప్రేమ లేఖ' సినిమాకు బలం ఈ పాటైతే, ఆ పాటకు మూలం ఓ లేఖ. సినిమా మొత్తం లేఖ చుట్టే తిరుగుతుంటుంది. చూడకుండానే లేఖ రాసిన వ్యక్తిని ప్రేమించేలా చేస్తుందీ ఆ లేఖ.

'అమ్మానాన్న నేను బాగానే ఉన్నా. ఏ దిగులు పెట్టుకోకండి. ఇప్పుడు సెలవులు లేవు. దసరా పండుగకు వస్తా' అని సైన్యంలో ఉన్న కుమారుడు రాసే లేఖ ఆ తల్లిదండ్రులకు భరోసాతో పాటు ధైర్యాన్నీ ఇస్తుంది. లేఖకు అంతటి బలం ఉంటుంది.

'నీకు పొరబోతుందీ అంటే నేను తలుచుకున్నానని అర్థం.. నిన్నెవరూ తలచేవారు లేరంటే నేను ఈ భూమి మీదనే లేనని అర్థం' అంటూ ప్రియురాలికి రాసిన ప్రియుడి లేఖ వారి హృదయాల ముడివేసే ఓ బంధం.

ఒకప్పుడు దూరంలో ఉండేవారి కులాసాలు ఇంటికి వచ్చే పోస్టుకార్డ్(ఉత్తరం) ద్వారా నే తెలిసేవి. మనసులోని మాటలను, అన్ని విషయాలను సమగ్రంగా రాసి ఎదుటి వారి కి చేరువ చేసేలా గతంలో పోస్టుకార్డులను విస్తృతంగా వాడేవారు. భావ వ్యక్తీకరణకు ఒకనాడు ఎంతో ఉపయుక్తంగా ఉన్న లేఖ లు నేడు కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)



లేఖ.. రాయలేక..

- కనుమరుగవుతోన్న ఉత్తరం
- సోషల్‌మీడియా రాకతో ఉక్కిరిబిక్కిరి
- ఒకనాటి అనుబంధాల తీపిగుర్తు
- పెరిగిన సాంకేతికతతో కనుమరుగు
- రాసేవారూ కరువు

ఉత్తరాలు రాయడం అంటే ఒకనాడు ఎంతో అద్భుతంగా, ఆనందపారవశ్యంగా ప్రతి ఒక్కరిలో అనిపించేది. సాంకేతికత పెరిగిన నేటి తరంలో పెన్నుపట్టి తన స్నేహితులకు, ఆత్మీయులకు లేఖలు రాసేవారే కనుమరుగయ్యారు. చాటింగ్‌ల ఉధృతిలో ఉత్తరం బతుకు ఉక్కిరిబిక్కిరిగా మారిపోయింది. ఉత్తరం రాక కోసం పోస్టుబాక్స్ ఖాళీగా ఎదురుచూస్తోంది. లేఖా రచ న ఒక సృజనాత్మకమైన ప్రక్రియ. ఇది సాహిత్య రంగంలో పేరు పొందింది. అంతటి ఘనచరిత్ర కలిగిన లేఖలను రాసే అలవాటూ ఈ తరం మరిచిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాసేవా రు లేక, మరోవైపు చదివే వారు కూడా కనిపించక అలనాటి మానవ సంబంధ, అనుబంధ సమాచార మాధ్యమమైన లేఖ(ఉత్తరం) సమా జం నుంచి దూరమయ్యే దుస్థితికి చేరుకుంది.

బట్వాడా నుంచి స్పీడ్‌పోస్ట్

పోస్టాఫీసుల ద్వారా రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, ఆసరా పింఛన్ల పంపిణీ, మ నిఆర్డర్, సేవింగ్, ఇన్సూరెన్స్, పార్శిల్, కమ్యూనికేషన్, కరస్పాండెంట్ ఉత్తరాలు, బల్క్ లెటర్లు, శ్రీరాముడి తలంబ్రాలు అందిస్తున్నారు. దీనికి తోడు వార,మాస పత్రికలను ఇళ్లకు చేరవేస్తున్నారు.



యోగక్షేమాల ప్రత్యుత్తరాలు తగ్గిపోయాయి

పోస్టాఫీస్ ద్వారా ఎక్కువ శాతం యోగక్షేమాలకు చెందిన ఉత్తరాలు తగ్గుముఖం పట్టాయి. ఫోన్ల ద్వారా ఛాటింగ్, మెసేజ్‌లతో సమాచారం వస్తుండటంతో ఉత్తరాలు తక్కువయ్యాయి. మిగతా సేవలు అన్నింటినీ అందిస్తూ సంపూర్ణంగా అందిస్తున్నాం. ఇతర సేవలపై పోస్టాఫీసులకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది.

- వెంకటస్వామిగౌడ్, పోస్ట్‌మన్, యాదగిరిగుట్ట



ఉత్తరాలు తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోయేవి

గత 50 ఏళ్ల కిందట ఉత్తరాలు తీపి జ్ఞాపకాలుగా ఉండేవి. కుటుంబ సభ్యులు, స్నేహితుల ద్వారా ఉత్తరాలు ఎప్పుడెప్పుడు వస్తాయని వాటికోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ఉత్తరాలు చదివితే ఎంతో మధురంగా ఉండేవి. చుట్టుపక్కల ప్రజలకు ఉత్తరాలు వస్తే ఇంటికి వచ్చి చదివించుకొని ఆనందపడేవారు. యోగాక్షేమాల ఉత్తరాలు కనుమరుగు కావడం బాధాకరం. గతంలో ఉత్తరాలు వస్తే వాటిని పెట్టెల్లో, బీరువాల్లో భద్రంగా దాచిపెట్టుకున్న సంఘటనలూ ఉన్నాయి.

- మల్లేశం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు





प्र.प्र./SPP/HYD - 2007 पोस्ट कार्ड POST CARD


క్లుప్తంగా.. మీమ్స్‌తో...

మారుతున్న కాలానుగుణంగా సమాచార మార్పిడిలోనూ చాలా మార్పులొచ్చాయి. ఉత్తరాల తర్వాత ఇంట్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు వాడేవారు. ఆ తర్వాత సెల్‌ఫోన్లు, ఇప్పుడు స్మార్ట్ ఫోన్లతో సమాచార మార్పిడి అత్యంత వేగంగా రూపాంతరం చెందింది. ఒకనాడు రోజుల్లో చేరే సమచారం ఇప్పుడు క్షణాల్లో అరచేతుల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో ఉత్తరం రాసే వారు కరువయ్యారు. అప్పట్లో సుదీర్ఘంగా రాసే లేఖల నియమాలు కూడా ఇప్పటి మెసేజ్, ఛాటింగ్‌లలో కనీసం కనిపించడం లేదు. సోషల్‌మీడియాలో ఇప్పుడు మీమ్స్(బొమ్మల) రూపంలో భావాన్ని వ్యక్తీకరిస్తున్నారు. దీంతో సృజనాత్మకంగా రాసే అలవాటూ పోతోంది. అపురూపమైన లేఖలను ఆ రచనా సంప్రదాయ పద్ధతిని కాపాడి భావితరాలకు ఆ వారసత్వాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



(इस लाइन के नीचे न तो लिखें और न ही मुद्रित करें Do not write or print below this line)

ఉత్తరం కోసం రోజుల తరబడి ఎదురుచూసే వాళ్లం



ఉద్యోగరీత్యా మా పిల్లలు దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకోవాలంటే కేవలం ఉత్తరాలు ఒక్కటే ఆధారం. ప్రతి రోజూ మాకు ఉత్తరం వచ్చిందా అంటూ పోస్ట్‌మన్లను అడిగే వాళ్లం. ఉత్తరం వస్తే అందులో తమ పిల్లల యోగక్షేమాలతో పాటుగా పండుగలకు ఎప్పుడు వస్తారని సమాచారం ఉండటం ఎంతో ఆనందంగా ఉండేది. ఇప్పుడు ఉత్తరాల ప్రాముఖ్యం తగ్గింది.

- గంగసాని రామారావు, యాదగిరిగుట్ట

సేవలు అందించడం ఆనందంగా ఉంది



ప్రతిరోజూ ఏదో రకమైన పార్శిలు, ఆధార్ కార్డులు, వార, మాస పత్రికలు. ఇతర పుస్తకాలను ప్రజలకు అందించి సేవలు చేయడం ఆనందంగా ఉంది. ప్రజలను పలకరించడం వారికి సమాచారం అందిస్తుంటే తమలో ఉన్న బాధలు సైతం కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా సమాచార సేవకులుగా సేవలు అందించడం గొప్పతనంగా ఉంది.

- ప్రశాంత్, డాక్ సేవకుడు, యాదగిరిగుట్ట

సుకన్య సమృద్ధి యోజనతో ఎంతో ప్రయోజనం



పోస్టాఫీసుల్లో సేవలు మారిపోయాయి. ఆడపిల్ల కోసం ఏర్పాటుచేసిన సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో ప్రయోజనం ఉంది. ఆడపిల్లలు ఉంటే వాటికి ఉన్నత చదువులు, పెళ్లిల నాటికి జమచేసిన డబ్బులతో రెట్టింపుగా రావడం కుటుంబానికి ఎంతో లాభసాటిగా ఉంటుంది.

- మీసాల స్వరూప, యాదగిరిగుట్ట

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కాన్వాయ్‌లో వాహనం బోల్తా

గొర్రెను తప్పించే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు ఢీ ● నలుగురికి స్వల్ప గాయాలు



వద్దిరెడ్డిగూడెం వద్ద బోల్తా పడిన స్కార్పియో

గుర్రంపోడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెను తప్పించే క్రమంలో ఎమ్మెల్యే కాన్వాయ్‌లోని వాహనం బోల్తా పడి నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండలం వద్దిరెడ్డిగూడెం వద్ద ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి గుర్రంపోడు మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అనుముల మండలంలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవానికి బయలుదేరారు. ఎమ్మెల్యే కారు వెనుక ఉన్న వాహనంలో పీఏ అశోక్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది ఉన్నారు. ఈ క్రమంలో వద్దిరెడ్డిగూడెం సమీపంలో రోడ్డు వెంట గొర్రె అడ్డురావటంతో దానిని తప్పించే క్రమంలో డ్రైవర్ వాహనాన్ని పక్కకు నడిపారు. అదే సమయంలో గుంతలోకి వెళ్లి అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను బలంగా ఢీకొట్టి ఎగిరిపడింది. అక్కడే ఉన్న స్థానికులు అప్రమత్తమై అందులో ఉన్న నలుగురిని బయటకు తీశారు. స్వల్ప గాయాలు కావటంతో, ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకర్‌రెడ్డి

బీబీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 160 గ్రాముల గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన ముల్కలపల్లి రమేష్, హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన టేకుల మనీష్ వీరికి తోడుగా బాలుడితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గంజాయిని విక్రయించి డబ్బులు సంపాదించాలని భావించారు. దీంతో హైదరాబాద్ దూల్‌పేటకు చెందిన సింగ్ వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి పరిసరా గ్రామాల్లో గంజాయికి అలవాటు పడిన యువకులకు ఎక్కువ డబ్బులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో మార్చి 31న దూల్‌పేటలో గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో బీబీనగర్ శివారులో టీఎస్30ఎల్5174 నెంబర్ బైకుపై ట్రిబుల్ రైడింగ్ చేస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానించిన పోలీసులు పట్టుకుని తనిఖీ చేసి, విచారించారు. వారి వద్ద 160 గ్రాముల గంజాయి, మూడు సెల్‌పోన్లు, బైకును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, తరుచూ ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్టును నమోదు చేస్తామన్నారు. ఎక్కువ రోజులు జైలులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

అర్వపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలోని కొమ్మాల గ్రామంలో జరిగింది. స్థానికులు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మహిళ సంఘం వీబీకే సిగ యాదమ్మ ఇంట్లో గ్యాస్‌సిలిండర్ పేలింది. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం కాలిపోయింది. వంట సామగ్రి, విలువైన వస్తువులు కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనతో సుమారు రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపింది.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం..

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధమైంది. కాలనీలోని రాఘవేంద్ర అపార్ట్‌మెంట్ కింద గల దుకాణ సముదాయంలో నిర్వహించే శ్రీలక్ష్మీ జిరాక్స్, బోటిక్ షాపులో షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. దీంతో మంటలు వ్యాప్తి చెంది జిరాక్స్ మిషన్‌తో పాటు కుట్టు, ఎంబ్రాయిడరీ మిషన్లు, ప్రింటర్ దగ్గమయ్యాయి. ఈ ఘటనతో రూ.7 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని నిర్వాహకురాలు పోలిశెట్టి సక్కుబాయి తెలిపారు. కస్టమర్ల వస్త్రాలతో పాటు బోటిక్‌కు సంబంధించి విలువైన సామగ్రి దగ్ధమయ్యాయని ఆమె వాపోయారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఆలేరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు-పెంబర్తి రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జీ కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు రైల్వేస్టేషన్ నుంచి పెంబర్తికి వెళ్లే దిగువ రైలుమార్గంలో 266/22-24 రాయి వద్ద దగ్గర గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై నీలం వైట్ కలర్ చెక్స్ టీషర్ట్, నీలం కలర్ ప్యాంట్ ఉందన్నారు. మృతదేహాన్ని భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచామన్నారు. వివరాలకు 9848222169 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



పాండు(ఫైల్)

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి సమీపంలోని దుప్పలపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తునికినూతలతండాకు చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన పాతులోతు పాండు(28) ఇటీవల బ్యాంక్ రుణంతో కారును తీసుకుని మిర్యాలగూడలోనే నివాసం ఉంటూ ఉపాధి పొందుతున్నాడు. అయితే మంగళవారం ముగ్గురు ప్యాసింజర్లను కిరాయికి కుదుర్చుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో సాయంత్రం నాలుగు గంటలకు దుప్పలపల్లి వద్దకు రాగానే కంటైనర్‌ను వెనక నుంచి కారు ఢీకొట్టడంతో పాండుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలైనట్లు సమాచారం. పాండు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం గురించి తెలియడంతో పాండు కుటుంబీకులు, బంధువులు, తండావాసులు హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలివెళ్లారు. ప్రమాదంలో పాండు మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పాండుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కేతేపల్లి సమీపంలో బాలుడు..



సాయిదేవాన్ష్(ఫైల్)

కేతేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బైక్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటనలో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన అనుముల ప్రవీణ్ హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో తల్లి దండ్రులతో కలిసి ఉగాది పండగ జరుపుకోవడానికి వచ్చాడు. పండగ తర్వాత మంగళవారం ఇంట్లో ఎల్లమ్మ పండగ చేస్తుండడంతో అవసరమైన గ్యాస్‌సిలిండర్ కోసం కేతేపల్లిలోని ఏజెన్సీ కార్యాలయం వద్దకు కుమారుడు సాయిదేవాన్ష్(6)తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. కేతేపల్లికి చేరుతున్న క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు అతివేగంగా వెళుతున్న ప్రసన్న ట్రావెల్స్‌కు చెందిన బస్సు ప్రవీణ్ బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ప్రవీణ్, ఆయన ఆరేళ్ల కుమారుడు సాయిదేవాన్ష్‌లు ఎగిరి కింద పడిపోయారు. ప్రవీణ్ చేయి విరగ్గా, దేవాన్ష్ తలకు తీవ్రగాయాలై రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి వెళ్లాడు. సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది క్షతగాత్రులను సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు దేవాన్ష్‌ను మెరుగైన చికిత్స కోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడకు చేరేలోపే సాయిదేవాన్ష్ ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. ఈ సంఘటనపై సాయిదేవాన్ష్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ శివతేజ తెలిపారు.

పొట్టకూటి కోసం వెళ్తే మృత్యువు వెంటాడింది

మద్దిరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కూలికి వెళ్లిన వృద్ధురాలిని కారు రూపంలో మృత్యువు వెం టాడింది. మంగళవారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో జరిగింది. ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌బాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన అలువాల స్వరాజ్యం(58) కూలి పని కోసం ఆటోలో మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామానికి వచ్చింది. కుంటపల్లి గ్రామ స్టేజీ వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్వరాజ్యంకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, చిన్నకుమార్తె రేణుక ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు.



తుడిమిడి మానాయికుంట ఎక్స్ రోడ్డు వద్ద పొలంలోకి దూసుకెళ్లిన కారు

పొలంలోకి దూసుకెళ్లిన కారు

శాలిగౌరారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది.కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన తుడిమిడి-గురజాల గ్రామాల మధ్యలో మానాయికుంట మూలమలుపు వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామానికి చెందిన గాజుల లింగయ్య, ఆయన భార్య రామనర్సమ్మ, కోడలు ప్రేమనంద కలిసి బంధువుల దశదిన కర్మకు సోమవారం యాద్రాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలకేంద్రానికి వెళ్లారు. మంగళవారం స్వగ్రామానికి బంధువుల కారు మాట్లాడుకొని స్వగ్రామానికి బయలుదేరారు. మానాయికుంట-గురజాల బ్రిడ్జి దాటి చిత్తలూరు గురజాల రోడ్డులో మలుపులో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. కారు టైర్‌పంక్చర్ అయ్యింది. కారులో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ప్రాణాలతో బయట పడడంతో ఊపిరిపీల్చుకున్నారు. కారులో ఉన్నవారిని స్థానికులు వెళ్లి బయటకు తీశారు. కొద్దిసేపటికి క్రేన్ సహాయంతో పొలంలోకి దూసుకెళ్లిన కారును బయటకుతీశారు. గత జనవరి 26న కూడా సింగారం గ్రామానికి చెందిన వారు రామగిరికి వస్తుండగా ఇదే ప్రాంతంలో కారు పల్టీ కొట్టింది. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సైదులు తెలిపారు.

రోడ్డుపై సూచిక బోర్డులు లేకనే ప్రమాదాలు

మానాయికుంట నుంచి గురజాల మధ్యలో మూసీనదిపై ఏడాది కిందట బ్రిడ్జితో పాటు ఇరువైపులా ఇటూఅటూ కిలోమీటర్ వరకు డబుల్ రోడ్డు వేశారు. కానీ సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



అంజయ్య(ఫైల్)

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఎలిమినేటి మాధవరెడ్డి(ఏఎమ్మార్పీ) ప్రధాన కాల్వలో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. నల్లగొండ జిల్లా గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం గుడిపల్లి మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన వట్టెపు అంజయ్య(35) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. వరుసకు బావ అయ్యే ఎల్లయ్యతో కలిసి సోమవారం సాయంత్రం ఊరు చివరన ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వద్ద స్నానం చేసి వద్దామని కలిసి వెళ్లారు. స్నానం చేస్తూ కాలు జారి కాల్వలో పడి గల్లంతయ్యాడు. కాపాడేందుకు ఎల్లయ్య ప్రయత్నించినా సాధ్యపడలేదు. వెంటనే కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారమిచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. నీటిపారుదల అధికారులతో మాట్లాడి ప్రదాన కాల్వ గేట్లను మూసివేశారు. గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం గల్లంతైన ప్రాంతం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. అంజయ్య సోదరి బోడ యాదమ్మ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలపరిధిలోని ఘనపూర్ గ్రామంలో ఈ విషాద సంఘటన జరిగింది. సిద్ధాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం సాకేల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య(40) అచ్చంపేట మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన బుర్యానాయక్ పొలంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయిన విద్యుత్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. లైన్ మార్చేందుకు యత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. యజమాని బుర్యానాయక్ మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా వెంకటయ్య మృతదేహం కనిపించింది. దీంతో ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటయ్య భార్య యాదమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేతనాల కోసం ఆరు నెలలుగా ఎదురుచూపులు

- నెరవేరని రెగ్యులరైజ్ హామీ
- అప్పులతో కుటుంబాలను వెల్లదీస్తున్న ఉద్యోగులు
- 19 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే విధులు




ఉపాధి కూలీలకు పని వివరాలు వెల్లడిస్తున్న ఉద్యోగి(ఫైల్‌ఫొటో)

మద్దిరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో పనిచేసే సిబ్బందికి వేతనాలు అందడం లేదు. ఒకటి, రెండు నెలలు కాదు, ఏకంగా ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఇటీవల ఉగాది పండుగకు పస్తులు ఉండాల్సి వచ్చిందని ఉపాధిహామీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోయారు. 19 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తాము రెగ్యులర్ చేస్తారనన్న ఆశతో ఉన్నట్లు కాంట్రాక్ట్ ఉద్యోగులు తెలిపారు. 2024 ఫిబ్రవరి 2న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కాంట్రాక్ట్ ఉద్యోగులకు పే స్కేలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా నేటికీ అమలు కాలేదని ఉద్యోగులు చెబుతున్నారు.

విధులు ఘనం.. వేతనాలు ఆలస్యం

ఉపాధిహామీ చట్టంలో గ్రామాల్లో కూలీలకు పనులు గుర్తించడం, బిల్లులు చెల్లించేలా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అదనపు ప్రాజెక్ట్ అధికారులు(ఏపీవో)లు 18 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 81మంది,కంప్యూటర్/అకౌంట్‌కు సంబంధించిన వారు 40మంది, ఫీల్డ్‌అసిస్టెంట్లు 270మంది, అటెండర్లు 23మంది ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ఉపాధిహామీ కూలీలతో పనులను చేయించడంలో, కూలీలకు వేతనాలు అందజేయడంలో భాగస్వాములవుతున్నారు. ఉపాధిహామీ పనులను క్రమం తప్పకుండా చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు నిధులను రప్పించడంలో కీలకపాత్ర పోషిస్తారు. ఉపాధి పనుల్లో హరితహారం, రైతువేదికలు, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, నీటి నిల్వ పనులు,పండ్లతోటల పెంపకం, మల్బరీ తోటల పర్యవేక్షణ, నర్సరీల నిర్వహణ లాంటి పనులను పర్యవేక్షిస్తుంటారు.ఇంత పనిచేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల గురించి ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.


వేతనాలు త్వరగా ఇవ్వాలి



మంత్రి హామీ ఇచ్చినట్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు పే స్కేలు అమలు చేయాలి. 19ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా నేటికీ పర్మినెంట్ చేయలేదు. ఆరు నెలల వేతనాలు రాకపోవడంతో పండుగపూట పస్తులు ఉండాల్సి వచ్చింది. వేతనాలు సకాలంలో చెల్లించాలి. వేతనాలు రాక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం.

బొబ్బిలి సుధీర్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు

చివరి తడి కోసం రైతుల పాట్లు



- బోర్లతో భగీరథ యత్నం
- పశువుల మేతగా మారుతున్న వరి

గుండాల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ పెరుగుతున్న భానుడి ప్రతాపంతో భూగర్భజలాలు అడుగంటి పోయి రైతులు పంటలు కాపాడుకోవడానికి చివరి తడి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో ఎన్నుడూ లేనంతగా మార్చిలోనే ఎండలు తీవ్రం కావడంతో పంట పొలాలు ఎక్కడికక్కడే ఎండిపోతున్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటి పోయి పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోతుండడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట రైతుల కళ్ల ముందే ఎండిపోయి పశువుల మేతగా మారుతోంది. దీంతో పంటకు తెచ్చిన అప్పు ఏ విధంగా తీర్చాలో అని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. గుండాల మండలంలో ఈసారి వర్షాలు తక్కువగా కురవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. గుండాల మండలంలోని 20 గ్రామాల్లో మొత్తం 12వేల ఎకరాలు సాగు చేయగా సుమారు 1000 ఎకరాలకు పైగా ఎండిపోయినట్లు తెలుస్తోంది. దీంతో రైతులు గత సంవత్సరం కంటే తక్కువగా సాగు చేసినప్పటికీ సగం పంట కూడా పారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10రోజులు అయితే వరి పంట చేతికొచ్చే దశలో కళ్ల ముందే ఎండిపోతుండడంతో ఆ పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.



బోర్లతో భగీరథ యత్నం

గుండాల మండలంలో ఈ సంవత్సరం వర్షాలు సరిగా కురవకపోవడంతో భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో బోర్లలో, వ్యవసాయ బావుల్లో నీటి ఊట తగ్గిపోయింది. తద్వారా రైతులు పంటలు కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నాలు చేస్తూ కొత్తగా బోర్లు వేస్తున్నారు. అయినప్పటికి బోర్లలో నీరు రాకపోవడంతో రైతులు తల పట్టుకుంటున్నారు. రైతులు పంటలు కాపాడుకోవడానికి అప్పులు తెచ్చి ఒక్కో బోరు 400ఫీట్ల పైన బోర్లు వేస్తుండడంతో 50వేల రూపాయల పైన ఖర్చు అవుతోంది. దీంతో పంటకు తెచ్చిన పెట్టుబడితో పాటు నూతనంగా బోర్లు వేసి బోర్లు పడకపోవడంతో ఈ అప్పు ఏ విధంగా తీర్చాలో తెలియని పరిస్థితిలో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గంపెడు ఆశలతో నాలుగు బస్తాల ధాన్యం పండితే ఎంతో కొంత లాభం చేకూరుతుందని ఆరుగాలం కష్టపడిన రైతుల రెక్కల కష్టం చివరికి నేల పాలవుతోంది. పొట్టకొచ్చిన పంట కళ్ల ఎదుటే ఎండుతుంటే రైతులు చేసేది లేక పశువులు, గొర్రెలను మేపుతున్నారు.

ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి



ఈ సంవత్సరం వర్షాలు సరిగా కురవకపోవడంతో గత సంవత్సరం కంటే వరి పంటలు తక్కువగా సాగు చేశాను. ఏడు ఎకరాల వరి పంట సాగు చేస్తే ఆరు ఎకరాల పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో పంటకు తెచ్చిన అప్పు ఏవిధంగా చెల్లించాలో తెలియడంలేదు. పంటను కాపాడుకోవడానికి నూతనంగా బోరు వేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది.ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- చెట్లపల్లి రాజయ్య , బూర్జుబావి, గుండాల మండలం

భూగర్భజలాలు అడుగంటడంతో ఇబ్బందులు



గతంలో ఎన్నడు లేనంతగా భూగర్భజలాలు అడుగంటి పోయాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రెండు ఎకరాల వరి సాగు చేయగా ఎకరం వరి ఎండిపోయి పశువులకు మేతగా మారింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

- రైతు గురుమూర్తి , మర్రిపడగ, గుండాల మండలం

ట్యాంకర్లతో పారిస్తున్న రైతులు

రాజాపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రాజాపేట మండలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు, బావుల కింద సాగు చేసిన వరిపంట ఎండిపోతోంది. మండలంలోని పారుపల్లి గ్రామంలో ఓ రైతు ట్యాంకర్లతో నీటిని పోసి పైరును పారిస్తున్నాడు. గ్రామానికి చెందిన కాలె నర్సింహులు 5 ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఎకరానికి 25 వేల రూపాయలు వెచ్చించాడు. రెండు బోర్లు, ఒక బావి ఉండగా ఐదు ఎకరాలు సాగు చేశాడు. వర్షాలు సరిగా కురవక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లు, బావులు ఎండిపోయాయి. మూడు ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. రెండు ఎకరాలు ముందుగా సాగు చేయడంతో కంకి దశకు చేరుకుంది. ఆపైరు మరో 20 రోజులైతే పంట చేతికొస్తుంది. దీంతో రైతు ఆ పంట రక్షణకు పడరాని పాట్లు పడుతున్నాడు. సమీప రైతు దగ్గర నుంచి నెల రోజులకు 5 వేల రూపాయలకు నీటిని కొనుగోలు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పోస్తున్నాడు. రోజుకు 8 ట్యాంకర్ల నీటిని పోస్తూ పారిస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు మండలంలో ఎండిపోయిన పంటలను పరిశీలించి నష్ట పరిహారాన్ని చెల్లించాలని మండల రైతులు కోరుతున్నారు.



సాగర్ సమాచారం




పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	519.10
టీఎంసీలు	147.6397
ఎడమకాల్వకు నీటి విడుదల	6870
కుడికాల్వకు	4050
విద్యుత్ కేంద్రం ద్వారా	0
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	2926
అవుట్‌ఫ్లో	13,020 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు



పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	623.93 అడుగులు
టీఎంసీలు	0.75
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	367.51 క్యూసెక్కులు

ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు

నల్లగొండ స్పోర్ట్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) యువకులు, విద్యార్థుల్లో క్రికెట్ క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీ నుంచి ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీనొద్దిన్ తెలిపారు. మంగళవారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 8 నుంచి 19 సంవత్సరాల బాలబాలికలకు శిక్షణ ఇస్తున్నామని, సీనియర్ కోచ్‌లతో ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి ఏడు గంటల వరకు శిక్షణ జరుగుతుందని కావున ఆసక్తి గల బాలబాలికలు ఈ నెల రెండో తేదీ నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, వివరాల కోసం 6302538123 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని కేంద్రీయ విద్యాయంలో ఈ నెల రెండో తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆఫ్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ జీ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తు ఫారాలను ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యాలయంలో పొందవచ్చని దరఖాస్తులు చేయడానికి ఈనెల 11వ తేదీ చివరి తేదీ అని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలపై బహిష్కరణ అస్త్రం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం యాజమాన్యాలు, వేతనాల కోసం ఫ్యాకల్టీ
- ఉమ్మడి జిల్లాలో 66ప్రైవేటు కళాశాలలు, 1800 మంది లెక్చరర్లు
- ప్రాక్టికల్స్‌కు హాజరు కావలసిన విద్యార్థులు 25వేలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షలపై మరోమారు బహిష్కరణ అస్త్రాన్ని విసిరాయి. గత అక్టోబరులో సమ్మె విరమణ ఒప్పందంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకోనందున మరోమారు సమ్మెకు సిద్ధమైనట్లు యాజమాన్యాలు ప్రకటించగా.. గత ఆరు నెలలుగా తమకు వేతనాలు అందనందున ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నట్లు లెక్చరర్స్ తెలిపారు. దీంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) పరిధిలో నేటి నుంచి రెండు గ్రూపులుగా జరగాల్సిన ప్రాక్టికల్స్, ఇంటర్నల్ పరీక్షలపై అయోమయం నెలకొన్నది. అయితే ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించడం లేదంటూ కళాశాల నుంచి వెళ్తున్న ఫోన్లతో విద్యార్థుల్లో అయోమయం నెలకొంది.

నేటి నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

నేటి నుంచి ఎంజీయూ పరిధిలో రెండు గ్రూపులుగా 2, 3, 4, 7, 8, 9వ సెమిస్టర్స్ ప్రాక్టికల్స్, ఇంటర్నల్ పరీక్షలు 2, 3, 4, 7, 8, 9వ తేదీల్లో జరగాల్సి ఉంది. సుమారు 66ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 25వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉంది. యాజమాన్యాల, లెక్చరెర్స్ బహిష్కరణ అస్త్రంతో ప్రైవేట్ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలపై సందిగ్ధం నెలకొంది. పరీక్షల నిర్వహణపై 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ అయోమయం నెలకొంది. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం గత అక్టోబర్‌లో వారం రోజుల పాటు సమ్మెబాట పట్టిన యాజమాన్యాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్లుతో పాటు ఉన్నత స్థాయి అధికారులు జరిపిన చర్చల్లో వారం రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీతో యాజమాన్యాలు సమ్మెను విరమించాయి. అనంతరం కొన్ని కళాశాలలకు మాత్రమే బకాయిలు చెల్లించగా ఇటీవల జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముందు ఉత్తర తెలంగాణలోని నాలుగు ఉమ్మడి జిల్లాల యాజమాన్యాలకు బకాయిలను విడుదల చేసిన ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాను మాత్రం విస్మరించిందని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. అదే సమయంలో ఉమ్మడి జిల్లాలోని 66 ప్రైవేట్ కళాశాలల్లో పని చేస్తున్న సుమారు 1800 మంది ఫ్యాకల్టీకి యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులతో వేతనాలు చెల్లించడం లేదు. దీంతో విసిగిపోయిన యాజమాన్యాలు, లెక్చరర్స్ ఎవరికి వారు ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నట్లు 15 రోజుల క్రితమే యూనివర్సిటీ అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు.

యాజమాన్యాలకు రూ.100 కోట్లు, లెక్చరర్లకు రూ.25 కోట్లు

ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.100కోట్లు రావల్సి ఉందని ఎంజీయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలు అంటున్నాయి. దీంతో కళాశాలల నిర్వాహణ పేరిట అప్పులపాలయ్యాయని యాజమాన్యాలు తెలిపాయి. అలాగే సుమారు 1800 మంది లెక్చరర్లకు గత ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వేతన బకాయిలు సుమారు రూ.25 కోట్లు పైబడి పేరుకపోయాయని. దీంతో కుటుంబాలను పోషించడం కష్టంగా ఉందని, లెక్చరర్లు వాపోతున్నారు.

ఇచ్చిన మాట నిలుపుకోవాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలి. భారీగా బకాయిలు పేరుకుపోవడంతో యాజమాన్యాలు అప్పుల పాలయ్యాయి. కనీసం సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని, భవనాల అద్దె చెల్లించలేని దుస్థితి. ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంటే కళాశాలలను శాశ్వతంగా మూసివేస్తాం.

● డి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఎంజీయూ ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్

వేతనాలు లేవు



కేవలం ఉపాధ్యాయ వృత్తిని మాత్రమే నమ్ముకున్న ప్రైవేట్ లెక్చరర్లకు యాజమాన్యాలు గత ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు.ప్రైవేట్ లెక్చరర్లలో అధిక మంది పేదలు, మధ్య తరగతి వారే. విధిలేని పరిస్థితుల్లోనే ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నాం. స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేస్తే మాకు వేతనాలు వస్తాయి.

● కె.కృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం

'దాసి' చిత్రం హిట్‌కు ప్రధాన కారకుడు సుదర్శన్

- ప్రముఖ సినీ విమర్శకుడు ప్రసేన్ బెల్లంకొండ
- సాగర్‌లో 'దాసి' సుదర్శన్ చిత్రకళా నిలయం ప్రారంభం



స్మారక చిత్రకళా నిలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖ కవులు, కళాకారులు, కార్టూనిస్టులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 'దాసి' చిత్రం పెద్ద హిట్ కావడానికి ప్రధాన కారకుడు 'దాసి' సుదర్శన్ అని ప్రముఖ సినీ విమర్శకులు ప్రసేన్ బెల్లంకొండ అన్నారు. మంగళవారం దాసి సుదర్శన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో గల సుదర్శన్ నివాసాన్ని ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, కవులు, కళాకారులు చిత్రకళా నిలయంగా మార్చారు. హైదరాబాద్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి చిత్రకళా నిలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసేన్ బెల్లంకొండ మాట్లాడుతూ దాసి చిత్రానికి సుదర్శన్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారన్నారు. ఆ చిత్రంలో హీరోయిన్ అర్చనను సుదర్శన్ తన కాస్ట్యూమ్స్‌తో అత్యంత సుందరంగా చూపించగలిగారన్నారు. ఆ చిత్రం దేశంలోనే పెద్ద హిట్ కావడంతో సుదర్శన్‌కు జాతీయ అవార్డు దక్కిందని తెలిపారు. నాటి నుంచి పిట్లంపల్లి సుదర్శన్ పేరు దాసి సుదర్శన్‌గా మారిందన్నారు.

తొలి జాతీయ అవార్డు అందుకున్న వ్యక్తిగా..

కాస్ట్యూమ్ విభాగంలో దక్షిణ భారతదేశంలో తొలి జాతీయ అవార్డు అందుకున్న వ్యక్తిగా సుదర్శన్ చరిత్రకెక్కారని ప్రసేన్ బెల్లంకొండ అన్నారు. సినీరంగంలో జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు వ్యక్తి కూడా సుదర్శన్ కావడం విశేషం అన్నారు. అంతేకాకుండా 'మాఊరు' అనే లఘు చిత్రానికి 1984 సంవత్సరంలో నంది అవార్డు కూడా వచ్చిందని, సుదర్శన్ ఆ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా ఉండటమే కారణమన్నారు. 2000 సంవత్సరంలో నంది అవార్డు కమిటీ సభ్యుడిగా వ్యవహరించారని, 2002లో రామానాయుడు నిర్మించిన 'హరివిల్లు' చిత్రానికి సుదర్శన్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారన్నారు. ఆ చిత్రానికి బంగ్లాదేశ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బహుమతి గెలుచుకున్నట్లు చెప్పారు. సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేసిన ఆయన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం పొందారని గుర్తు చేశారు. కవి, రచయిత వేణు సంకోజు మాట్లాడుతూ ప్రముఖ చిత్రకారుడు, రచయిత, బహుభాష ప్రజ్ఞశాలి, ఉత్తమ ఉపాధ్యాయుడు అయిన సుదర్శన్ సినీ రంగంలో జాతీయ అవార్డును అందుకున్న తర్వాత దాసి సుదర్శన్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. సాగర్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన నాగార్జునకొండ, బుద్దవనంతో పాటు దాసి సుదర్శన్ చిత్ర కళా నిలయాన్ని కూడా సాగర్‌కు వచ్చే పర్యాటకులు సందర్శించేలా చూడాలని ప్రముఖ కవులు, వక్తలు కోరారు. ప్రతి ఏటా కళాకారులు, చిత్రకారులు సుదర్శన్ స్మారక అవార్డులు కూడా అందజేయడానికి కృషిచేస్తామని ఆయన స్నేహితులు తెలిపారు. అంతే కాకుండా ఏటా రెండుసార్లు సుదర్శన్ స్మారక క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు ఆయన జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ సతీమణి స్వతంత్ర, కుమారుడు చక్రవర్తి, మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, ప్రభాకర్, కిరణ్మయి, మోహన్‌రాజు, ప్రసాద్, మున్నా, రచయిత వేణు, జర్నలిస్టు కృష్ణమూర్తి, కార్టూనిస్టులు శంకర్, విజయ్, కూరెళ్ల వెంకట్ ఆనంద్, చిత్రకారుడు నరసింహ, సాహితీవేత్తలు సరికొండ నరసింహరాజు, రామ్మోహన్ రాజు, శ్యాంసుందర్, హరికృష్ణ, శ్రీనివాస్, లక్ష్మణ్‌రెడ్డి 200 మంది కవులు, కళాకారులు పాల్గొన్నారు.

యువతను మోసగిస్తున్న ప్రభుత్వాలు: ఏఐవైఎఫ్

వలిగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసగిస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏఐవైఎఫ్ మండల నాలుగో మహాసభ జరిగింది. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి ధర్మేంద్ర మాట్లాడుతూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా, మత ఛాందస విధానాలు నూరి పోయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్వార్థ రాజకీయాలు తెర లేపుతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలది కాదా? అని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఏఐవైఎఫ్ విద్య, వైద్యం ఉపాధి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సూచించారు. వలిగొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మూసీ నదిని ప్రక్షాళన చేయాలని అన్నారు. మారోజు నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి పోలెపాక యాదయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎలగందుల అంజయ్య నాయకులు వీరస్వామి, సాయికుమార్, దేవేందర్, రాజు, వినయ్, నాగరాజు, కృష్ణకుమార్, ప్రదీప్, సుదర్శన్, మత్స్యగిరి, యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,89,590ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



ఆంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకుడు

కొండపైన మాలధారణ

స్వామివారి ఆలయంలో ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద మంగళవారం భక్తులు మాలధారణ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 25మంది భక్తులు పసుపు వర్ణం దుస్తులతో దీక్ష స్వీకరించారు. వీరికి కొండకింద గోదాం వద్ద గల రెండు గదులు కేటాయించారు. దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదాన సత్రంలోనే ప్రత్యేకంగా వంటలు చేసేందుకు ఈవో ఏ. భాస్కర్‌రావు ఆదేశించారు. వచ్చే నెల 11న స్వామివారి జయంతి ఉత్సవం, స్వాతి నక్షత్రం రోజున కలిసి రానుండటంతో అదే రోజు దీక్ష విరమిస్తారు. కాగా మంత్రి పర్యటన నేపథ్యంలో వాహన పూజలు రద్దుచేయడంపై కొంతమంది భక్తులు అసహనం వ్యక్తం చేశారు.



కొండపైన మాలధారణ చేసిన భక్తులు

భక్తి భావంతోనే జీవితాలకు సార్ధకత

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భక్తి భావంతోనే ప్రజలు తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణానికి చెందిన వేదాంత గీతాల ఫౌండేషన్ అధ్యక్షుడు అభినవ శంకరానందగిరి స్వామిజీ అన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో స్థానిక ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో యతి కుటీరం నందు ఈనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆత్మజ్ఞాన సదస్సును అధ్యక్షుడు భారత పురుషోత్తం అధ్యక్షత వహించగా స్వామిజీ ప్రారంభించారు. జ్ఞానం గొప్పతనాన్ని వేద శాస్త్రాల సారాన్ని, తత్వ జ్ఞానాన్ని ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం ఆలయం ఆవరణలో ఉపదేశిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మిక జ్ఞానం, భక్తి, ధర్మనిష్ఠ ప్రజలు తెలుసుకుని వాటిని పాటించాలని, తద్వారా వారి జీవితాలను సార్ధకత చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షులు భారత పురుషోత్తం, గౌరవాధ్యక్షుడు కటకం తుకారాం, ఉపాధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్, సహాయ కార్యదర్శి సుంకి వెంకటేష్, కోశాదికారి పుప్పాల నాగేశ్వర్, సిరిమల్లె వెంకటేష్, దేవాలయం అధ్యక్షులు డాక్టర్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షులు భారత అంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయ కార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి ఇంజమూరి యాదగిరి, ధర్మకర్తలు మెరుగు యతినందం, ఆటిపాముల నాగేష్, వనం కృష్ణ, చిక్క వెంకటేశం, నక్క రామచంద్రం పాల్గొన్నారు.



భక్తులకు ఉపదేశం చేస్తున్న అభినవ శంకరానంద స్వామిజీ



ఆత్మజ్ఞాన సదస్సుకు హాజరైన భక్తులు

14 వరకు రాజీవ్ యువవికాసం దరఖాస్తుల గడువు

చిట్యాలరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేయించుకోవాలని చిట్యాల ఎంపీడీవో ఎస్‌వీ. జయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన వారికి ఏడాదికి ఆదాయం రూ. 1.50లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. రేషన్‌కార్డు ఉన్నవారు ఆదాయం సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు.

సమాచార హక్కు వికాస సమితి మండల సభ్యుడిగా మహేష్

శాలిగౌరారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటం గ్రామానికి చెందిన పాక మహేష్ సమాచార హక్కు వికాస సమితి మండల కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సమస్యలపై మండలిలో గొంతెత్తుతా: నెల్లికంటి


ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సన్మానిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

మునుగోడు రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో గొంతెత్తుతానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన మంగళవారం మండలంలోని ఎలుగలగూడెం గ్రామంలో వివిధ పార్టీల నాయకులు, మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఉడుత సైదులు, కొరటికల్ మాజీ సర్పంచ్ వల్లూరి లింగయ్య పద్మ, మాజీ ఎంపీటీసీ మిర్యాల లక్ష్మి, బీరప్ప, రైతు సంఘం అధ్యక్షుడు బూర్గు లింగయ్య, రాజీవ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకరాజు యాదగిరి, బొడిపల్లి యాదగిరి, వల్లూరి శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

9న జ్యోతిర్లింగ్ల దర్శన రైలు యాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న అధికారులు

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ్ల దర్శన రైలు యాత్ర ఈ నెల 9వ తేదీన ప్రారంభం కానుందని ఐఆర్‌సీటీసీ టూరిజం అధికారి నరేష్ బాబు తెలిపారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం ఏడు జ్యోతిర్లింగ్ల దర్శన యాత్ర కోసం సికింద్రాబాద్ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక టూరిస్టు ప్యాకేజీతో ఈ రైలు ప్రారంభం అవుతుందన్నారు. 9వ తేదీన సత్తలింగ, జ్యోతిలింగ దర్శన యాత్ర సికింద్రాబాద్, నిజామాబాద్ మీదుగా ఉజ్జయినికి వెళ్తుందన్నారు. ఇందులో ఏడు జ్యోతిర్లింగాల దర్శనాలు ఉంటాయన్నారు. ఉజ్జయిని మహాకాళేశ్వర్, హోంకాళేశ్వర్, నాగేశ్వర్, సోమనాథ్, బీమాశంకర్, త్రయంబకేశ్వర్, గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగాలను దర్శనం చేయవచ్చు అన్నారు. ఈ యాత్ర కోసం టికెట్ ప్రారంభం ధర రూ.20,980 ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఫోన్‌నెంబర్‌లు 9701360701, 9281030711, 9281030712 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ సంప్రదాయాలను పరిరక్షించడమంటే వాటిని మనింటిలో ఆచరించడమేనని వాస్తు పండితుడు, దేవీ ఉపాసకుడు కేవీ శర్మ అన్నారు. పూర్వీకుల నుంచి వచ్చిన సనాతన సంప్రదాయాలను పరిరక్షించగల శక్తి మహిళలకు కూడా ఉందని అన్నారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన శ్రీ నారీశక్తి నార్కట్‌పల్లి సభ్యుల సమావేశంలో మాట్లాడారు. కేవలం మహిళతోనే పంచాంగ శ్రవణం గావించారు. ప్రపంచ దేశాలు భారత్‌ను పొగుడుతున్నాయంటే అందుకు సనాతన సంప్రదాయాలను ఆచరించడమే కారణమన్నారు. నారీశక్తిలో సభ్యులను మరింతగా చేర్చి హిందూ సంస్కృతి సంప్రదాయాల పట్ల మరింత అవగాహన కల్పించేలా కృషి చేయాలని సూచించారు.

ఆత్మస్థైర్యం నింపేందుకు క్రీడలు దోహదం


బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

గట్టుప్పల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యువతి, యువకుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి క్రీడలు ఉపయోగపడతాయని డీవైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి అన్నారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా వెల్మకన్నె గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు టేకుమట్ల కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు పరసగోని నితిన్, రావుల వెంకట్, వరికుప్పల ముత్యాలు, మహేష్, పవన్ కల్యాణ్, రామకృష్ణ, శివ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శాలిగౌరారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌కు భారీగా ధాన్యం తరలిరావడంతో రైతుల కష్టాలపై 'కొనుగోలు ప్రారంభమయ్యేదెప్పుడో' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మినీలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శాలిగౌరారంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధ వారం మధ్యాహ్నం 12 గంటలకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభిస్తారని మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, కార్యదర్శి చీనానాయక్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు మార్కెట్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

అంగన్‌వాడీ@అద్దె భవనం

● ఆరు నెలలుగా అందని అద్దె బకాయిలు ● ఒకే చోట మూడు అంగన్‌వాడీ సెంటర్లు ● అందని ఆటవస్తువులు, బొమ్మలు


పడమటితాళ్ళ గ్రామంలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న మినీ అంగన్‌వాడీ కేంద్రం

చండూరు రూరల్, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): సొంత భవనాలు లేక అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అరకొర వసతుల మధ్య పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందడం లేదు. మునుగోడు నియోజకవర్గంలో సుమారు 300లకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో సగానికి పైగా అద్దె భవనాలు ఉన్నాయి. ప్రభుత్వ నుంచి ఆరు నెలల నుంచి అద్దె రాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు సొంతంగా చెల్లిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు ఆటవస్తువులు, వంట సామాగ్రి, ఫర్నీచర్ కూడా సరిగా అందక దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించి అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని పలువురు కోరుకుంటున్నారు.

చండూరు మండలంలో రెండు సెక్టార్లలో 56 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో కేవలం 13 మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. 22 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మిగిలిన 21కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రెండు కేంద్రాలు కలిపి ఒకేచోట నిర్వహిస్తున్నారు. మునిసిపల్ కేంద్రంలో మూడు సెంటర్లు కలిపి ఒకే చోట నిర్వహిస్తుండడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు అంగన్‌వాడీ సెంటర్‌కు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కేంద్రంలో ఒక వార్డు నుంచి మరో వార్డుకు నిత్యం నడుచుకుంటూ రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి చండూరు మండలంలో 2 అంగన్‌వాడీ టీచర్లు, 13 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.


ఉడుతలపల్లిలో కమ్యూనిటీ హాల్‌లో

● మునుగోడు మండలంలో మొత్తం రెండు సెక్టార్లకు గాను 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో కేవలం ఎనిమిది మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. 18 కేంద్రాలు అద్దె భవనాల్లో 33కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, కమిటీ హాళ్లలో కొనసాగిస్తున్నారు.

● మర్రిగూడ మండలంలో రెండు సెక్టార్లలో 49 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో కొన్ని సెంటర్లు ప్రభుత్వ పాఠశాలలు, కమిటీ హాల్‌లలో నిర్వహిస్తున్నారు. నాలుగు సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కమ్మగూడ, యరగండ్లపల్లి, పడమటి తండాల్లో టీచర్లు లేక ఖాళీగా ఉండి సెంటర్లను తెరవడం లేదు. మండలంలో మొత్తం 20 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

● నాంపల్లి మండలంలో రెండు సెక్టార్లలో 46 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఆరు అద్దె భవనాలు, 12 ప్రభుత్వ పాఠశాలలు, కమిటీ హాళ్లలో నిర్వహిస్తున్నారు.

వసతులు ఉన్న భవనాలు దొరకడంలేదు



ఎన్నో సంవత్సరాలుగా ఈ అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహిస్తున్నాం. చిన్న చిన్న గ్రామాల్లో అన్ని వసతులు కలిగిన అద్దె భవనాలు దొరకడం కష్టం. అయినా అప్పుడప్పుడు ఆ అద్దె భవనాలను మార్చుతూ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ప్రతి నెల నెల రాకుండా ఆరు నెలలకు ఒకసారి, ఒక్కో సారి సంవత్సరానికి ఒక సారి అద్దె డబ్బులు రావడంతో మా చేతి నుంచి అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

● సునీత అంగ్‌వాడీ టీచర్, కోటయ్యగూడెం

వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం



మా ఊర్లో అద్దె ఇళ్లలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో సరైన సదుపాయాలు లేవు. ఇక్కడకు వచ్చినప్పుడు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గ్రామంలో ప్రభుత్వం సొంత భవనం నిర్మించాలి. అప్పుడు పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

● సాయం శ్రీదేవి, కోటయ్యగూడెం

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి


శాలిగౌరారం : చిత్తలూరులో సన్న బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని చిత్తలూరు గ్రామంలో మంగళవారం ఉచిత సన్నబియ్యం పంపిణీ చేశారు. ప్రజలు దొడ్డు బియ్యం తినలేని పరిస్థితిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆహర్నిశలు పనిచేస్తుందన్నారు. రేషన్ షాపులో సన్న బియ్యమే కాకుండా కొన్ని నిత్యావసర వస్తువులు కూడా త్వరలో అందజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, తహసీల్దార్ పి. యాదగిరి, డిప్యూటీ తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, నాయకులు వేముల గోపినాథ్, వడ్లకొండ పరమేష్‌గౌడ్, బోడ అరుణ్‌కుమార్, మద్ది మహేష్, మారుపాక శ్రీదర్, గుత్తా రవీందర్‌రెడ్డి, రేషన్ షాప్ డీలర్ల సంఘం మండలాధ్యక్షులు దండ శంకర్‌రెడ్డి, డీలర్ రాచమళ్ల యాదగిరి, పంచాయతీ కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.

మర్రిగూడ: పేదలు సన్నబియ్యం చరిత్రాత్మక ఘట్టమని తహసీల్దార్ బక్క శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని నెంబర్-2 రేషన్ దుకాణంలో మంగళవారం సన్నబియ్యం పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీలు పాశం సురేందర్ రెడ్డి, మేతరి యాదయ్య మాట్లాడుతూ పేదలకు సన్నబియ్యం అనే ఆలోచన ప్రభుత్వానికి రావడం హర్షణీయమన్నారు. బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధి దారులకు బియ్యం సరఫరా చేయడంలో డీలర్లు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాస నీలిమా చంద్రశేఖర్, శ్రీరామదాసు శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయక్, పాండురం గారావు, డీటీ చంద్రశేఖర్, లోకేష్, వెంకటంపేట బాలయ్య, ఎన్నమనేని రవీందర్‌రావు, అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు రూరల్: పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊకొండి గ్రామంలో మంగళవారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చండూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ నేలపట్ల నరేష్, మాజీ ఎంపీపీలు పోలగోని సత్యగౌడ్, మేడి నాగలక్ష్మి, యాదయ్య, కర్నాటి స్వామి, మాజీ జడ్పీటీసీ జాజుల అజయ్ గౌడ్, బీమనపల్లి సైదులు, బూడిద లింగయ్య, పాల్వాయి చెన్నారెడ్డి, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, పాలకూరి యాదయ్యగౌడ్, మిరియాల వెంకన్న, జిట్టగోని యాదగిరి, నడింపల్లి యాదగిరి, చెన్నారెడ్డి, ఉడుత సైదులు, వీరభద్రం, పందుల శ్రీనివాస్, మాదవన్, రుషిగౌడ్ ఉన్నారు.


చండూరులో సన్న బియ్యం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నిర్బంధాలతో పోరాటాలు ఆపలేరు



మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని పలు సంఘాల నాయకులు అన్నారు. హెచ్‌సీయూ భూములను రక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో ఎంజీయూ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం అక్రమంగా విశ్వవిద్యాలయ భూములను లాక్కుంటోందని ఆరోపించారు. విశ్వవిద్యాలయ భూములు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉద్దేశించినవన్నారు. విద్యా పరిశోధనల కోసం కేటాయించిన భూములను వ్యాపార ప్రయోజనాల కోసం ప్రభుత్వం కబళించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, జాన్ ప్రేమ్, రవి, సుధీర్, నవీన్, రవి, తరుణ్, కోటి, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: హెచ్‌సీయూనీ భూములను వేలం వేయవద్దని విద్యార్థుల ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాంపల్లి చంద్రమౌళిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. విశ్వవిద్యాలయాలను, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన దశలో ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు.

మునుగోడు: హెచ్‌సీయూలో 400ఎకరాల భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించే ధర్నాకు వెళ్లనీయకుండా మునుగోడులో సీపీఎం నేతలను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఆ పార్టీ మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్ ఆరోపించారు. హెచ్‌సీయూ భుముల విక్రయాన్ని విరమించుకోవాలన్నారు.

గట్టుప్పల్: హెచ్‌సీయూలోని భూముల వేలాన్ని ఉపసంహరించుకోవాలని ధర్నాకు బయలు దేరిన సీపీఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ, కక్కునూరు నగేష్, గుమ్మికొండ యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిరసిస్తూ హైదరాబాద్ వెళ్తున్న సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం.. ప్రజాపాలనంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్. లూర్దుమారయ్య, వంగూరి వెంకన్న తదితరులు ఉన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి


కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏవో సన్నిరాజు

తిప్పర్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పంటకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి సన్నిరాజు తెలిపారు. మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. తాలు, గడ్డి లేకుండా ధాన్యం తీసుకొస్తే షరతులు లేకుండా మద్దతు ధర పొందవచ్చని సూచించారు. మార్కెట్‌లో 90శాతం మంది రైతులు నాణ్యమైన ధాన్యం తెస్తున్నా, 10శాతం రైతులు తమ ధాన్యాన్ని శుభ్రం చేయకుండా పోసి కాంటా చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానంలో కాకుండా ప్రతి రైతు ప్యాడీ క్లీనర్‌లను సద్వినియోగం చేసుకొని మార్కెట్ నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సంతోషిని, అవినాష్‌రెడ్డి, సిరసవాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, ఏప్రిల్ 1:(ఆంధ్రజ్యోతి) శ్రీవిశ్వావసు నామ సంవత్సర మొదటి మంగళవారం పురస్కరించుకుని మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకాఎల్లమ్మ ఆలయంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో మొక్కుబడి కల్యాణం నిర్వహించారు. భక్తులు చీరసారె ఒడిబియ్యం బోననైవేద్యాలు సమర్పించారు.

లారీ డ్రైవర్ల కుటుంబాలకు చేయూత



చిట్యాలరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన లారీ డ్రైవర్ల కుటుంబాలకు డ్రైవర్స్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఏపూర్‌కు చెందిన గుమ్మి చరణ్‌రెడ్డి లారీ డ్రైవర్‌గా చేస్తూ అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతిచెందాడు. విఘ్నేశ్వర లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు సేకరించిన రూ.83,600లు అధ్యక్షుడు ఎంపల్ల మోహన్‌రెడ్డి చరణ్‌రెడ్డి కుటుంబానికి అందజేశారు. అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కూరాకుల ధనంజయ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా కుటుంబానికి ఏపూర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులకు రూ.75వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపల్ల వెంకట్‌రెడ్డి, అయితగోని స్వామి, అంతటి నరేష్, పాలెం శంకరయ్య, అంజయ్య, లింగయ్య, శేఖర్, రవి, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, లింగస్వామిగౌడ్, వెంకటేశంగౌడ్, ధనంజయ, వెంకటేశం పాల్గొన్నారు.

ఘనంగా మారమ్మవాడి బంగారు పండుగ వేడుకలు

మర్రిగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం మారమ్మవాడి సేవలాల్ మహారాజ్ బోగో బంగారు వేడుకలను మండలంలోని కుదాభక్షపల్లి గ్రామపంచాయతీలోని సాయిబండా తండాలో గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. భక్తులు కానుకలు, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు కొర్ర శ్రీను, సుధాకర్, బొగ్గు పాండు, అంబోతు నాయక్, లక్ష్మణ్, రమేష్, జటావత్ హనుమంత్, వడ్త్యా పద్మలు పాల్గొన్నారు. అంతకు ముందు మారమ్మ వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేషన్ దుకాణాల వద్ద ప్రధాని ఫొటో ప్రదర్శించాలి

కేతేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌక ధరల దుకాణాల వద్ద ప్రధాన మంత్రి మోదీ ఫొటో ప్రదర్శించాలని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా నాయకుడు తాడోజు నర్సింహ్మాచారి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయం నుంచి రాష్ట్రంలో ఉచితంగా కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల బియ్యం ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం కిలో మాత్రమే ఇస్తుందన్నారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యానికి అయ్యే వ్యయంలో కేంద్ర ప్రభుత్వం రూ.40 భరిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా రూ.10 మాత్రమే భరిస్తుందన్నారు. అలాగే బియ్యానికి అయ్యే ఖర్చు ఎవరు ఎంత భరిస్తున్నారనే బోర్డులు కూడా పెట్టాలని డిమాండ్ చేశారు.

ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపుపై 5శాతం రాయితీ

రామగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఈ నెల 31వ తేదీ లోగా చెల్లిస్తే ప్రభుత్వం 5శాతం రాయితీ కల్పించినట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆస్తి పన్ను వడ్డీ బకాయిలపై 90శాతం రాయితీ సౌకర్యం సోమవారంతో ముగిసింది. నల్లగొండ మునిసిపాలిటీలో 42,111 గృహ నిర్మాణాలు ఉండగా, పాత బకాయిలతో కలుపుకొని రూ.47కోట్ల 33లక్షలు ఉండగా సోమవారం రాత్రి వరకు రూ.17కోట్ల 38లక్షలు వసూలు అయ్యాయి. ఇంకా రూ.29 కోట్ల 90 లక్షలు వసూలు కావాల్సి ఉంది.

ఆర్థిక సాయం అందజేత

రామగిరి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీపీఈటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రాచకొండ చంద్రశేఖర్ కుటుంబసభ్యులకు ఆ సంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.2లక్షల 20 వేల అందజేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారంజరిగిన సంతాప సభలో వారు చంద్రశేఖర్ కుటుంబసభ్యులకు ఈ మొత్తం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడిద వెంకటేశ్వర్లు, కోశాధికారి సిహెచ్ బాలస్వామి, గౌరవ సలహాదారులు కమ్మంపాటి నర్సింహ్మా, రవిశంకర్, తోట శ్రవణ్, వరికుప్పల హన్మంతు, బరాల స్వామి, గుండ నాగయ్య, బొజ్జ జానీ, మండలి పరమేష్, గోలి వెంకన్న, పసుపులేటి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి


***

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 2 ఏప్రిల్ 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 22.4

సాగర్ ప్రాజెక్టుకు.. కాల్షియం ముప్పు



తెలుగు రాష్ట్రాల వరప్రదాయినిగా, 22 లక్షల ఎకరాలకు సాగు నీరు, 9 కోట్ల మందికి తాగునీటిని అందిస్తున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కాల్షియం ముప్పు పొంచి ఉంది. కాల్షియంతో గ్యాలరీల్లో పోరస్ హోల్స్ మూసుకుపోవడంతో సీపేజ్ నీరు బయటకు రావడం లేదు. దీంతో ప్రాజెక్టు గోడలకు పగుళ్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు, ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్యాంకు ఏమైనా జరిగితే రెండు రాష్ట్రాల భవిష్యత్ ఆందోళనకరంగా మారుతుంది. డ్యాం నిర్వహణను చూసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని నిపుణులు, ఇంజనీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

» పూడిన పోరస్ హోల్స్

» కాల్షియాన్ని తొలగించకపోతే ప్రాజెక్టుకు పెనుప్రమాదం

» ఆందోళనలో అధికారులు, ఇంజనీర్లు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 220 అడుగులు, 350 అడుగులు, 420 అడుగుల ఎత్తులో మూడు గ్యాలరీలను క్రస్ట్‌గేట్ల లెవల్(546అడుగులు ఎత్తు) వరకు నిర్మించారు. ఈ మూడింటిలో పోరస్ రంధ్రాలతో(హోల్స్) పాటు డ్రైనేజీ హోల్స్ కూడా ఉంటాయి. మూడు గ్యాలరీల్లో 1,200 పోరస్ హోల్స్ ఉండగా 3 వేలకు పైగా డ్రైనేజీ హోల్స్ ఉంటాయి. పోరస్ హోల్స్ ద్వారా సీపేజ్ నీరు డ్రైనేజీ రంధ్రాల్లోకి వెళ్తుంది. అక్కడి నుంచి సీపేజ్ నీరు నదిలో కలుస్తుంది. ప్రస్తుతం మూడు గ్యాలరీల్లోని పోరస్ హోల్స్ అన్నీకాల్షియంతో నిండిపోయి సీపేజ్‌నీరు బయటకు వెళ్లడంలేదు. దీంతో డ్యాం గోడలకు పగుళ్లు వచ్చే అవకాశంఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 1,200పోరస్ హోల్స్‌లలో సుమారు350 పూర్తిగా మూసుకుపోయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పోరస్ హోల్స్ ఎందుకంటే

మానవ శరీరంలో మలినాలు బయటకుపోవడానికి స్వేదరంధ్రాలు ఉన్నట్లు ప్రాజెక్టులకు కాల్షియం నుంచి ముప్పు వాటిల్లకుండా నీటిలో పేరుకుపోయిన కాల్షియం బయటకు వెళ్లేందుకు పోరస్ హోల్స్‌ను ఏర్పాటుచేస్తారు. శరీరంలో మలినాలు చెమట రూపంలో బయటకు ఎలా వెళ్తాయో పోరస్ హోల్స్ ద్వారా ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన కాల్షియం అలాగే బయటకుపోతుంది. దీంతో ప్రాజెక్టు గోడలు పగుళ్లు ఏర్పడకుండా ఉండి ప్రాజెక్టుకు ప్రమాదం జరగకుండా ఉంటుంది.

గ్యాలరీల ద్వారా రోజుకు మూడు జీపీఎం నీరు వెళ్లాలి

గ్యాలరీల్లోని పోరస్ హోల్స్ ద్వారా రోజుకు మూడు జీపీఎం(గ్యాలన్స్ పర్ మీటర్)ల నీరు బయటకువెళ్లాలి. ప్రతి రోజూ ఎంత నీరు బయటకు వెళ్తుందో సంబంధిత ఇంజనీర్లు తమ సిబ్బందితో కొలతలు వేయిస్తారు. ప్రస్తుతం పోరస్ హోల్స్ మూసుకుపోవడంతో రోజుకు ఒక జీపీఎం నీరు మాత్రమే బయటకు వెళ్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఇలాగే కొనసాగితే డ్యాం గోడలకు పగుళ్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

లోపలివైపు శుభ్రపరిస్తేనే మేలు

పోరస్‌హోల్స్ 220, 350, 420 గ్యాలరీల నుంచి క్రస్ట్‌గేట్ల లెవల్ 546 అడుగుల వరకు ఉంటాయి మొదటి ఐదు మీటర్లు నిలువుగా ఆ తర్వాత అడ్డంగా డ్యాం గోడలకు రిజర్వాయర్ లోపలి వైపు వరకు ఉంటాయి. లోపల పేరుకుపోయిన కాల్షియంను తొలగిస్తేనే ప్రాజెక్టుకు ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. పోరస్ హోల్స్‌లో పేరుకుపోయిన కాల్షియాన్ని అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి తొలగించాలని నిపుణులు, ఇంజనీర్లు చెబుతున్నారు.



కాల్షియం తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం



గ్యాలరీల్లోని పోరస్ హోల్స్‌లలో పేరుకుపోయిన కాల్షియాన్ని లోపలి వైపు నుంచి తొలగించేందుకు ప్రతి ఏడాది 400 రంధ్రాల చొప్పున (గ్యాలరీల్లో 1,200 పోరస్ హోల్స్ ఉన్నాయి) మూడేళ్లు పడుతుంది. దీనికిగానూ ప్రతి ఏడాది రూ.కోటి ఖర్చవుతుండటంతో రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ ఏడాది ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పనులు మొదలుపెడతాం.

- మల్లిఖార్జున్‌రావు, ప్రాజెక్టు ఈఈ

సన్నబియ్యం పథకం పేదలకు వరం

» రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

» జీ.ఎడవల్లిలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన మంత్రి

» రూ.4.67కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

» ఐకేపీ కేంద్రం ప్రారంభం



జీ.ఎడవల్లిలో సన్నబియ్యం బ్యాగులను పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, కనగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సన్నబియ్యం పథకం పేదలకు వరమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జీ.ఎడవల్లి గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్నబియ్యం పథకం ప్రారంభంలో భాగంగా లబ్ధిదారులకు బియ్యం సంచులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలం లో పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ వినియోగదారులకు 200యూనిట్ల ఉచిత కరెంటు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలకు కొత్త రేషన్‌కార్డులను అందజేయలేదన్నారు. కమీషన్లు దండుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు జేసారని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీలో ఇటీవల జరిగిన ప్రమా దం దురదృష్టకరమన్నారు. ప్రమాదం కారణం గా సొరంగం పనులు నిలిచాయని, మరో ఏడా ది ఆలస్యమైనీ ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయిస్తానన్నారు. జీ.ఎడవల్లిలో రూ.4.67కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయటం ఆనందంగా ఉందన్నారు. జీ.ఎడవల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. జీ.ఎడవల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠిని కోరారు. రాజీవ్ వికాసం పథకం దరఖాస్తు గడువు ప్రభుత్వం పొడిగించిందని, నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవంలో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సన్నబియ్యం రైస్‌లో ఎన్నో రకాల పోషక విలువలు ఉన్నాయన్నారు. షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచటంలో విటమిన్లు సహకరిస్తాయన్నారు. సన్నబియ్యం పథకం నిర్విఘ్నంగా సాగాలంటే రైతులు ఇకనుంచి సన్నరకం వరి సాగును పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మంత్రికి మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి సభా స్థలం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్ రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ చాయదేవి, డీసీవో పత్యానాయక్, పీఆర్ ఈఈ గిరిధర్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎల్లమ్మ ఆలయ ఛైర్మన్ సీహెచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి, మందడి రాంచంద్రారెడ్డి, జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, కృష్ణయ్యగౌడ్, మురళీ, వెంకటేశంగౌడ్, రాజారెడ్డి, వెంకటేశం, జియావుద్దీన్, హఫీజొద్దిన్, ఆర్‌ఐలు సునీత, యాదగిరి ఏపీఎం హరి, సీసీలు పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీస్ జాగిలం(బన్ని) మంగళవారం నల్లగొండ నుంచి జీ.ఎడవల్లికి వచ్చింది. సభా ప్రాంగణంలో అనుమానిత వస్తువుల జాడకోసం హ్యాండ్లర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీ చేసింది. కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి గ్రామంలో మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప ర్యటన పురస్కరించుకుని కాంగ్రెస్‌నేతలు గ్రామంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

పోలీస్ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

కనగల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పీసీ నిమ్మ బేబీ షాలినీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠి ప్రశంసించారు. ఇటీవల జాతీయ పోలీస్ క్రీడలకు తెలంగాణ తరఫున బేబీషాలినీ వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారు. పలు మ్యాచ్‌లలో ఆమె అత్యుత్తమ ఆటతీరును కనబర్చింది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు.

పండుగ వాతావరణంలో..

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించే కార్యక్రమం జిల్లాలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. కనగల్ మండలం జీ.యడవల్లి గ్రామంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఏప్రిల్ నుంచి లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 997 రేషన్ దుకాణాలను ఇందుకు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 4,66,522 రేషన్ కార్డులకు 13,85,506 మంది లబ్ధిదారులున్నారు. ఒక్కొక్క లబ్ధిదారునికీ ప్రతి నెలా ఆరు కిలోల సన్నబియ్యం అందజేస్తారు. జిల్లాకు ఏప్రిల్ నెలలో 89,708 క్వింటాళ్ల సన్న బియ్యం కేటాయించారు. జీ.యడవల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని అనుముల, నారమ్మగూడెంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, శాలిగౌరారం మండలంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో అన్ని రేషన్ దుకాణాల్లోనూ పండగ వాతావరణంలో సన్న బియ్యం రేషన్ పంపిణీ చేయాలని నిర్ణయించారు. రేషన్ దుకాణాలకు రంగులు వేయడం, మామిడి తోరణాలు కట్టి, పూజలు చేసి లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి దుకాణంలో ప్రజాప్రతినిధులు వారికి వీలుకానిచోట అధికారులు అందించాలని నిర్ణయించారు.

డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి : ఎస్పీ



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సేవ కార్యక్రమాల్లో భాగంగా డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలకు సోల్జర్‌లుగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. ఇంపాక్ట్ యాంటీ నార్కోటిక్స్ (డగ్స్) బృందం మంగళవారం ఎస్పీని కలిసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ద్వారా పోలీస్ కమాండ్ సెంటర్‌లో శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. ఇప్పటికే తాము ప్రభుత్వ అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పించామని తెలిపారు. డ్రగ్స్ నిరోధానికి తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ యాంటీ నార్కోటిక్ బృందం భాగస్వాములు కావడంతో మరింత అవగాహన పెంపొందించవచ్చన్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నూనె సుదర్శన్ మాట్లాడుతూ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని సమాజ సేవలో ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నూనె సుదర్శన్, లోడంగి గోవర్ధన్, గూడూరి అంజిరెడ్డి, కోట్ల సాయికిరణ్, నారాయణ, కవిత, కోట సరిత ఉన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

● వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల బిల్లులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్య.కా.స.) రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిందని, నెల అంతా సరిపోవని వ్యక్తికి 25కిలోలు చొప్పున పంపిణీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించడంతో చేసిన పనులకు కూలీలకు డబ్బులు ఇవ్వలేని స్థితి ఏర్పడిందన్నారు. పెద్ద ఎత్తున పెండింగ్ బిల్లులు ఉండడంతో వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, ఉడుగుండ్ల రాములు, ర నాయక్ పాల్గొన్నారు.

డిగ్రీ ప్రాక్టికల్స్ పరీక్షలు బహిష్కరిస్తాం

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎంజీయూ పరిధిలో డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరిస్తున్నామని తెలంగాణ లెక్చరర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సైదులు తెలిపారు. మంగళవారం ఫోరం తరఫున ఎంజీయూలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లుగా స్కాలర్‌షిప్‌లు రాకపోయినా, అప్పులుచేసి కళాశాల యజమాన్యాలు అధ్యాపకుల జీతాలు చెల్లిస్తూ వచ్చాయన్నారు. ఐదారు నెలలుగా నిర్వహణ చార్జీల వడ్డీలు పెరిగి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో ప్రయోగ పరీక్షలు బహిష్కరిస్తామని తెలిపారు.

నల్లగొండలో భూప్రకంపనలు ?

● వాట్సాప్‌లో పుకార్లు షికార్లు

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం నల్లగొండలో మంగళవారం పలుమార్లు భూకంపం వచ్చినట్లు పుకారులు షికార్లుచేశాయి. పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డు, మీర్‌బాగ్ కాలనీతోపాటు వివిధ ప్రాంతాల్లో భూమి కంపించిదంటూ వాట్సప్‌లలో చక్కర్లు కొట్టడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొన్ని సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించినట్లు సోషల్ మీడియాలో సైతం వైరల్ అయింది. మీర్‌బాగ్ కాలనీవాసులు మాత్రం అసలు అలాంటిది ఏమి లేదని, భూమి కంపించినట్లు కూడా తెలియలేదని తెలిపారు. మయన్మార్, థాయిలాండ్‌లలో ఇటీవల భారీ భూకంపం వచ్చిన అనంతరం నల్లగొండలో భూకంపమంటూ ఆనోటా, ఈనోటా చెప్పుకోవడంతో ప్రజలు భయపడ్డారు. అయితే ఈదంతా పుకారేనని తెలియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

5న మెగా జాబ్‌మేళా

డిండి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ఈ నెల 5న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డిండి ఎస్ఐ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలను డిండి పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న వ్యక్తులు 5వ తేదీన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్దకు ఉదయం రావాల్సి ఉంటుందన్నారు. అక్కడినుంచి నల్లగొండకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సెల్:8712675544ను సంప్రదించాలన్నారు.

'మత్తడి'కి మరమ్మతులు చేస్తే..

» 200 ఎకరాలకు సాగునీరు

» నిరాదరణతో కోల్పోయిన ఆనవాళ్లు

» ధ్వంసమైన మత్తడి అలుగుకట్ట



ఒకప్పుడు ఆ మత్తడి నీటితో నిండుగా ఉండేది. పిల్లలు వేసవిలో ఈత కొట్టేది. గ్రామస్థులు గాలాలు వేసి చేపలు పట్టేవారు. చుట్టుపక్కల రైతులకు సాగునీటి కొరత తీరేది. కానీ దశాబ్దాలు గడిచాయి. నిరాదరణకు గురైన మత్తడి ఎండిపోయింది. మత్తడి వద్ద కట్టిన అలుగు ఏన ధ్వంసమైంది.అప్పట్లో నీటితో కళకళలాడిన మత్తడిని స్వయంగా చూసిన రైతులు ఇప్పుడు ఆ మత్తడిని మళ్లీ అలా చూడాలనుకుంటున్నారు. రాబోయే కొన్ని నెలల్లో బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు నీరు కాల్వ ద్వారా వచ్చేలోపే మత్తడికి మరమ్మతులు చేయాలని నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం గ్రామరైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

ఏపీలింగోటం శివారులో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మత్తడిని 1982లో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్మించినట్లు రైతులు చెబుతున్నారు. గ్రామానికి పడమర దిక్కున ఉన్న చెర్వు నీటిని వరదకాల్వ ద్వారా తరలించి తూర్పు దిక్కున ఉన్న ఈ మత్తడిలో నిల్వ చేసే వారు. ఫలితంగా చుట్టుపక్కల ఉన్న రైతుల బావుల్లో, బోరు బావుల్లో సమృద్ధిగా నీరు లభించేది. ఒకవేళ వరదనీటి ఉధృతి పెరిగితే అలుగు ద్వారా, మత్తడికున్న కట్ట తూము ద్వారా నీటిని వదిలితే కట్టంగూరు మండలం పామనుగుండ్ల చెరువుకు చేరేవి.కానీ ఏపీలింగోటం చెర్వులో కొన్ని దశాబ్దాలుగా ఒంద్రుమట్టి పేరుకుపోవడంతో చెరువులో నీరు ఇంకటం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో జాలు కాల్వ ద్వారా మత్తడికి చేరే నీరు ఆగిపోయిన కారణంగా నిరాదరణకు లోనైన మత్తడి ఆనవాళ్లు కోల్పోయింది.

మత్తడికి మరమ్మతులు చేస్తే

బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు ద్వారా ఇటీవల మండలంలోని పలు గ్రామాల రైతులు చెరువులను సొంత ఖర్చుతో శ్రమదానంతో నింపారు. రానున్న రోజుల్లో ప్రాజెక్టు కాల్వ ద్వారా ఏపీలింగోటం చెరువు నింపే అధికారిక ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే అప్పట్లో నాణ్యతాలోపంతో నిర్మించిన మత్తడి శిథిలమైంది. దీంతో వర్షం నీరు కూడా నిలవడంలేదు. బీ.వెల్లెంల ప్రాజెక్టు నీళ్లు వచ్చే అప్పటిలోగా మత్తడికి మరమ్మతులు చేస్తే కృష్ణాజలాలను మత్తడిలో నిల్వ చేసుకోవచ్చని, ఇదే జరిగితే తమకు శాశ్వతంగా సాగునీటి సమస్య తీరుతుందనేది రైతుల ఆలోచన.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



ఏపీలింగోటం శివారులో నిరాదరణకు గురైన పూర్వకాలపు మత్తడి దుస్థితిని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశందృష్టికి తీసుకెళ్లాం. మత్తడికి మరమ్మతులు చేస్తే సుమారు 200ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఉపాధి హామీ పథకం ఏపీవో వచ్చి మత్తడిని క్షేత్రపరిశీలన చేశారు. మత్తడిలో ఆనవాళ్లు లేకుండా ఏపుగా పెరిగిన చెట్లను తొలుత ఉపాధి పనిలో భాగంగా తొలగిస్తామని చెప్పారు.

- పశుపతి, చెర్వుగట్టు దేవస్థానం మాజీ ధర్మకర్త



నాగార్జునసాగర్‌లో దాసి సుదర్శన్ చిత్ర కళా నిలయం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసేన్ బెల్లంకొండ

సుదర్శన్‌తోనే 'దాసి' హిట్ అయ్యింది

● ప్రముఖ సినీ విమర్శకుడు ప్రసేన్ బెల్లంకొండ

● సాగర్‌లో 'దాసి' సుదర్శన్ చిత్రకళా నిలయం ప్రారంభం

'దాసి' చిత్రం పెద్ద హిట్ కావడానికి ప్రధాన కారకుడు సుదర్శన్ అని ప్రముఖ సినీ విమర్శకుడు ప్రసేన్ బెల్లంకొండ అన్నారు. దాసి సుదర్శన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సుదర్శన్ నివాసాన్ని ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, కవులు, కళాకారులు చిత్రకళ నిలయంగా మార్చారు. హైదరాబాద్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి ప్రారంభించారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

7

6న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

కొండమల్లేపల్లి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని సీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 6న సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాయిని మాధవరెడ్డి తెలిపారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బుచ్చిరెడ్డి, వేమన్‌రెడ్డి, దాచేపల్లి నరేందర్, వెంకటేష్‌యాదవ్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

కరువు భత్యాన్ని విడుదల చేయాలి

దేవరకొండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఐదు విడుతల కరువు భత్యం విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ, అంకం చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కరువు భత్యం విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు, పెన్షన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెన్షనర్లకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలన్నారు.

పిల్లలను చెరువుల వద్దకు వెళ్లనీయొద్దు

● నర్సింహులు, సీఐ, దేవరకొండ



త్వరలో పిల్లలకు వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి.దీంతో వారిని స్నానం కోసం వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని దేవరకొండ సీఐ నర్సింహులు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి- దేవరకొండ)

ఆంధ్రజ్యోతి : వేసవిలో పిల్లలు స్నానం కోసం వ్యవసాయ బావులు, చెరువుల వద్దకు వెళ్లకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: వేసవిలో పిల్లలు స్నానం కోసం చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లి ఈత రాక మృత్యువాత పడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వవద్దు.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: దేవరకొండ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. వాహనాలలో తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నవారిపై చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు చర్యలేవి?

సీఐ: దొంగతనాల నివారణకు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. దేవరకొండ పట్టణం, గ్రామాల్లో పోలీసులు సంచరించి అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నాం. ఇంటికి తాళంవేసి ఊరు వెళ్లేవారు విలువైన వస్తువులు ఇంట్లో పెట్టి వెళ్లవద్దని జాగ్రత్తలు చెబుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

సీఐ: పోలీస్‌శాఖ సూచించిన నియమ, నిబంధనలను పాటించాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు. ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించవలసి వస్తుంది.

రైల్వే ఫ్లైఓవర్ నిర్మించరూ..

● యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణంతో దామరచర్ల-వీర్లపాలెం రైల్వే గేటు వద్ద రాకపోకలకు ఇబ్బంది

● ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

దామరచర్ల-వీర్లపాలెం గ్రామాల మధ్య దారిలో ఉన్న దామరచర్ల వద్ద రైల్వేట్రాక్‌తో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. దామరచర్ల నుంచి అడవిదేవులపల్లి మండలకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ట్రాక్ ఉండటం వల్ల రైళ్లు ప్రయాణించే సమయాల్లో గేట్లు వేయడం వల్ల రెండు వైపులా ప్రయాణికులు వేచి చూడాల్సి వస్తోంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)



దామరచర్ల-వీర్లపాలెం రైల్వే గేటు వద్ద ఆగి ఉన్న వాహనాలు

దామరచర్ల నుంచి వీర్లపాలెం, తాళ్లవీర్పగూడెం, ఉల్సాయిపాలెం, అడవిదేవులపల్లి గ్రామాలకు తరచుగా వివిధ అవసరాల కోసం దామరచర్ల, మిర్యాలగూడ ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకురావడానికి, గొర్రెలు, పశువులను సంతకు తరలించడానికి ట్రాక్టర్లు గూడ్స్ ఆటోలపై ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఎక్కువగా గిరిజన ప్రజలు నివసిస్తున్నందున చిన్న చిన్న అవసరాలకు టౌన్‌కు వచ్చిపోవడం తప్పని సరైందని రైల్వే ట్రాక్ వల్ల తరుచుగా ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారు. కాగా సమస్య పరిష్కారానికి రైల్వే అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

థర్మల్ పవర్ ప్లాంట్‌తో పెరిగిన రద్దీ

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌తో ఈ మార్గంలో విపరీతమైన వాహనాల రద్దీ ఏర్పడింది. పవర్‌ప్లాంట్ నిర్మాణం కోసం దూరప్రాంతాల నుంచి ఇనుము, స్టీల్, యంత్ర పరికరాలు లాంటివి పవర్‌ప్లాంట్‌కు చేరవేసేందుకు పెద్దపెద్ద వాహనాలు వస్తుంటాయి. దీని వల్ల రైల్వే గేటు వద్ద రాకపోకలు నిలిచినప్పుడు గేట్ల వద్ద రెండువైపులా మరిన్ని వాహనాలు నిలిచి గేట్లు ఎత్తినప్పుడు ట్రాక్ దాటానికి టూవీలర్లకు సైతం కష్టంగా మారుతోంది అధికారులు ట్రాఫిక్ ఇబ్బందులు గమనించి విష్ణుపురం నుంచి థర్మల్ పవర్‌ప్లాంట్ వరకు బొగ్గు రవాణా కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 8 కి.మీ

రైల్వే ట్రాక్‌కు దామరచర్ల- తాళ్లవీరప్పగూడెం వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేశారని, అదే తరహాలో దామరచర్ల వద్ద ఏర్పాటు చేయడమో వీలు కాని పక్షంలో ఫ్లైఓవర్ నిర్మించడమో చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బొత్తలపాలెం ప్రమాదంతో అప్రమత్తం

దామరచర్ల రైల్వేగేటుకు 3 కి.మీ దూరంలో ఉన్న బొత్తలపాలెం రైలుపట్టాలపై గేటు లేకపోవడంతో గతంలో ఘోరప్రమాదం చోటు చేసుకుంది. తండాల నుంచి మిర్యాలగూడ ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులను తీసుకవస్తున్న బస్సును రైలును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 14 మంది చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. సంఘటన తీవ్రతకు చలించిన రైల్వే అధికారులు రైల్వే గేటు ను ఏర్పాటు చేసి రైళ్ల ప్రయాణ సమయంలో వాహనాలు, ప్రయాణికులు పట్టాలపైకి రాకుండా ప్రమాదాలు నివారణకు ఏర్పాట్లు చేశారు. బొత్తలపాలానికి సమీపంలోని రాళ్లవాగు తండా వద్ద జరిగిన రైలు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడటంతో అధికారులు రైల్వే గేటు ఏర్పాటు చేసి కాపలాదారుని నియమించారు.

ఫ్లైఓవర్‌ను ఏర్పాటు చేయాలి



దామరచర్ల-వీర్లపాలెం రహదారిపై రైల్వేగేటు ఉంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఆమార్గంలోను ఉండటం వల్ల రోజుకు వేల సంఖ్యలో వాహనాలు ఆ దారిలో ప్రయాణిస్తున్నాయి. రైల్వే గేటు వద్ద ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుంది. అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలి.

- కొండారపు పూర్ణచందర్‌రావు, దామరచర్ల

అండర్‌పాస్ ఉపయోగం ఉండదని నిలిపివేశారు

దామరచర్ల - వీర్లపాలెం రైల్వేగేటు వద్ద నాలుగేళ్ల క్రితమే అండర్‌పాస్ మంజూరైంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటుకు నిర్మాణ సామగ్రి, యంత్ర పరికరాలు రవాణా చేసేందుకు భారీ వాహనాలు, కంటైనర్లు ఆ మార్గంలో ప్రయాణిస్తునందున అండర్‌పాస్ ఉపయోగం ఉండదని ఏర్పాట్లు నిలిపివేశారు. ప్రస్తుతం రైల్వే డబ్లింగ్ పనులు నడుస్తున్నందున ఫ్లైఓవర్ ఏర్పాట్ల విషయం గురించి సమాచారం లేదు.

-సూర్యనారాయణ, నడికుడి-మిర్యాలగూడ రైల్వే ఇంజినీర్

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



వేంకటేశ్వర స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంపోడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా మంగళ వారం స్వామి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ స్థానిక నాయకులు ఆలయ కమిటీ సభ్యులు నిర్వ హిం చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జాలపెద్ద సత్తయ్య యాదవ్ మాట్లాడుతూ ఆలయ ప్రారంభోత్సవం నుంచి నేటి వరకు ప్రతి ఏడాది స్వామివారి కల్యాణం నిర్వహించడం వల్ల ఈ ప్రాంతం పాడిపంటలతో సుభిక్షంగా ఉందన్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని పరిసర ప్రాంత భక్తులు, మండల కేంద్రంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ అభినందనీయం



మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిట్టిపోలు యాదగిరి, తదితరులు

నిడమనూరు, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): వేసవితాపం నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించడానికి మజ్జిగ పంపిణీ చేపట్టడం అభినందనీయమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. మండలంలోని బంకాపురం గ్రామంలో అమ్మనాన్న ఫౌండేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గతేడాది 44 రోజులు నిర్వహించామనిఈ ఏడాది 60 రోజులు నిర్వహిస్తామని తెలుపడం సంతోష దాయకమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పేలపూడి బాలకృష్ణ, గ్రామ పెద్దలు చిన్నవెంకటేశ్వర్లు, రాయపాటి పేరయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీరమళ్ల శ్రీనివాస్, చిరుమామిళ్ల శ్రీనివాస్‌రావు, పాంపాటి యాదగిరి, గుండా లింగయ్య, వెంక టేశ్వర్‌రావు, రామయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కళాశాలల బకాయిలు వెంటనే విడుదల చేయాలని టీడీపీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులు గౌడ్ కోరారు. ఏళ్లతరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాక పోవడంతో డిగ్రీ, పీజీ ప్రైవేట్ కళాశాలలువిద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఆయా బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ● హాలియా , నిడమనూరు మండలంలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

హాలియా, నిడమనూరు ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా పట్టణంలోని 9వ నంబర్ రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ, నిడమనూరు మండలం నారమ్మగూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం సన్న బియ్యం పథకం పేదలకు వరమని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. హాలియాలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రఘు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, పిల్లి ఆంజనేయులు, ఆర్ఐ నవీన్ కుమార్, నాయకులు చింతల చంద్రారెడ్డి, గౌని సుధారాణి, కుందూరు రాజేందర్‌రెడ్డి, మజార్ పాల్గొన్నారు నిడమనూరు కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, ఏపీఎం లక్ష్మీనారాయణ, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, మాజీ జడ్పీటీసీ నందికొండ రామేశ్వరిమట్టారెడ్డి, మాజీ సర్పంచ్ కొండా కృష్ణవేణీ శ్రీనివాస్ రెడ్డి, వల్లభ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గడ్డం గోవిందరెడ్డి, యడవెల్లి నరేందర్‌రెడ్డి, నర్సింగు విజయ్‌కుమార్, సైదిరెడ్డి పాల్గొన్నారు.



నిడమనూరు : నారమ్మగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జైవీర్‌రెడ్డి

12న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఈనెల 12న మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగం కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఎన్నో పోరాటాలు చేయడంతో చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారుకార్మిక శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఇంద్రయ్య, నగేష్, పాల్వాయి యాదగిరి, బొడ్డుపల్లి భిక్షం, భూతరాజు సైదులు, జావెద్, సైదులు, పొట్ట ప్రకాష్, చిలరాజు శ్రీను, కొంగల వెంకటయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని డిపో మేనేజర్ గంగుల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు దశాబ్దాల కాలంగా ప్రతి ఏటా చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చిల్లంచర్ల ఆది నారాయణ, శివరాం, శ్రీనివాస్‌గుప్తా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఎం రామ్మోహన్‌రెడ్డి

మేరెడ్డి సురేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

నిడమనూరు, ఏప్రిల్ 1, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేరెడ్డి సురేందర్‌రెడ్డి పేదలకు, పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని మారుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన సురేందర్‌రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో జానారెడ్డి మాట్లాడుతూ సురేందర్‌రెడ్డి సర్పంచ్, ఎంపీటీసీ వంటి ఎన్నో వివిధ పదవులు చేపట్టి గ్రామానికి, ప్రజలకు విశేష సేవలు అందించాడని కొనియాడారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి నాయకులు సురేందర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సేవ చేయాలని సూచించారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పార్టీలకతీతంగా పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, సురేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు మేరెడ్డి వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కర్నాటి లింగారెడ్డి, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, అంకతి వెంకటరమణ, నందికొండ మట్టారెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, శివమారయ్య, నర్సింగు విజయ్, చిత్రం జీవన్‌రావు, సింగం రామలింగయ్య, సురుగురు శేఖర్, అప్పారెడ్డి పాల్గొన్నారు.



సురేందర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న జానారెడ్డి, జైవీర్‌రెడ్డి

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి యువత దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో రమేష్ మంగళ వారం సూచించారు రాజీవ్ యువ వికాసం 2025 సంవత్సరానికి ఏడాదికి రూ.1.50 లక్షలు ఆదాయంలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన వారు ఈనెల 14లోపు ఆన్‌లైన్‌లో, లేదా ఎంపీడీవో కార్యాలయంలో దర ఖాస్తులు సమర్పించాలన్నారు. రేషన్‌కార్డు ఉన్న వారు ఆదాయం సర్టిఫికెట్ సమర్పిం చాల్సిన అవసరం లేదని, రేషన్‌కార్డు లేని వారు ఆదాయం సర్టిఫికెట్ సమర్పించాల న్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు, ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు జిరాక్స్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపివేయాలి



దేవరకొండలో అరెస్ట్ అయిన సీపీఎం నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ(హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ) భూముల విక్రయించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల విక్రయ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ హెచ్‌సీయూ ఎదుట ధర్నా పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు వెళ్లకుండా ఆ పార్టీ నా యకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడలోమంగళవారం తెల్లవారు జామున వన్ టౌన్ పోలీసులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్, జగన్,పట్టణ కార్యదర్శి న్యూమాన్, రఘు, ఆనంద్, రవి, పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : మండల సీపీఎం కార్యదర్శి జటావత్ రవినాయక్‌తోపాటు ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌అధికారంలోకి రాకముందు, వచ్చిన తరువాత ప్రభుత్వ భూముల విషయంలో ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందని వారు విమర్శించారు.

● హాలియా : భూములను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ ముందు జరిగే ధర్నా వెళ్లకుండా హాలియాలో సీపీఎం నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను తదితరులు ఉన్నారు.

● వేములపల్లి : హైదరాబాద్‌లో నిరసన వ్యక్తం చేసేందుకు వెళ్లకుండా సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్ల సంపత్, ప్రణీత్‌రెడ్డి, పుట్టల సైదులు ఉన్నారు.

● దేవరకొండ : దేవరకొండలో అరెస్టయిన వారిలో సీపీఎం దేవరకొండ కార్యదర్శి నల్లా వెంకటయ్య, నాయకులు బిజిలి లింగయ్య యాదగిరి, పర్వత్‌రెడ్డి, బుడిగె వెంకటేష్, జ్యోతి, ఎగ్బాల్, నర్సింహ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు పండించిన ధాన్యం విక్రయించడానికి ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో అందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వేములపల్లిలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

వేములపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట తక్షణమే సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సర్వీస్ రోడ్డు లేక పోవడంతో మండల కేంద్రంలో కొద్దిరోజులుగా రోడ్డు వెంట నడిచే పలువురు గ్రామస్థులు మృత్యువాత పడ్డారన్నారు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం లేదన్నారు. కార్యక్ర మంలో మాతంగి సత్యం, ఎల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ క్రైస్తవ సంఘ నాయకులు మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తుల ప్రదర్శన చేసిన అనంతరం సాగర్‌రోడ్ మీదుగా అమర వీరుల పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోడిరెక్క రాజేంద్రకుమార్, జోజి, సుధీర్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.